ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

Entered

జులై 10, 2005

వంటింటి నేస్తాలు

గుమ్మడి కబుర్లు



మాధవి

సీరియల్ ప్రారంభం

టీనేజ్ మేనేజ్‌మెంట్

హ్యాపీ బర్త్‌డే

10.7.2005 నుంచి 16.7.2005 వరకు

కె. ప్రభుచరణ్
1సం॥, 10.7.2004
సువర్ణ-ఏసన్న
పసుపల-కర్నూలు

విహాస్
1సం॥, 10.7.2004
భువనేశ్వరి-శ్రీనివాస్
లక్ష్మణచాంద్-ఆదిలాబాద్

వినయ్‌కుమార్
1సం॥, 10.7.2004
రామనర్సమ్మ-రవి కుమార్
అడవిదేవులపల్లి-నల్లగొండ

డి. భువనేశ్వరి
7సం॥, 12.7.1998
రాజేశ్వరి-రాజయ్య
డోర్నకల్-వరంగల్

రక్షిత్
3సం॥, 11.7.2002
కుమారి-అనంతరామయ్య
బర్హాన్‌పురం-ఖమ్మం

మినర్వశ్రీ
1సం॥, 12.7.2004
కరుణశ్రీ-వెంకట్
నల్లగొండ

ఎస్.హర్షిత
3సం॥, 14.7.2002
ప్రసన్నలక్ష్మి-ఈశ్వర్
వనపర్తి-మ॥నగర్

వి. వంశీ
4సం॥, జూలై-2001
నీరజ-వెంకటేష్‌గౌడ్
నర్సాపూర్-మెదక్

చందనసాయి
7సం॥, 16.7.1998
రమ-శ్రీనివాస్
అగనంపూడి-విశాఖ

ఎస్. జయప్రకాష్
5సం॥, 16.7.2000
అనితారాణి-కమలాకర్
కుందారం-వరంగల్

బి. స్మైలీ
2సం॥, జూన్-2003
పద్మ-వెంకన్న
అనంతారం-నల్లగొండ

గమనిక: పదేళ్ల వరకు వయస్సు గల చిన్నారులందరికీ ఈ 'హ్యాపీ బర్త్‌డే' శీర్షిక కింద ఉచితంగా శుభాకాంక్షలు తెలియచేస్తాం. దీనికి మీరు చేయవలసిందల్లా మీ చిన్నారి పుట్టిన తేదీకి 20 రోజులు ముందుగా ఓ కలర్ ఫొటో జత చేసి మీ చిన్నారి పేరు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, చిరునామా వంటి వివరాలు పంపడమే. ప్రజాశక్తి శుభాకాంక్షలతో మీ చిన్నారి పుట్టిన రోజును ఆనందంగా జరుపుకోండి.

పంపవలసిన చిరునామా:

హ్యాపీ బర్త్‌డే, స్నేహ ప్రజాశక్తి ఆదివారం
అనుబంధం, 1-1-298/4, స్ట్రీట్ నెం.1,
అశోక్ నగర్, హైదరాబాద్-20

ఈ వారం అతిథి

విలువలు వాటంతటవే రావు



ముందు తరం వారికి ఆదర్శంగా లేకపోవడమే కారణం కావచ్చు. కాబట్టి విలువలనేవి పిల్లవాణ్ణించే ఉత్పత్తి అయ్యేవి అనుకోవడం అంత భావ్యం కాదేమో!

పాఠ్యాంశాలు కూడా మనిషి విలువల్ని నిర్ణయం చేస్తాయి. పాఠ్యాంశాల లోపట కులాలు, మతాలను ప్రశంసిస్తూ రెండో వైపున కులాలు, మతాలు లేవని మనం అన్నాకానీ పిల్లల మీద మనం అనుకున్నంత ప్రభావం చూపించవు. టెక్స్టుబుక్‌కి అంత ప్రాధాన్యత ఉంది. ఇంకా ప్రింట్‌మీడియాకున్నటువంటి ప్రభావం జనవాక్కుకి లేదు. ఇవ్వాళ గుజరాత్ అల్లర్ల వెనుక ఆ రాష్ట్ర పాఠ్యపుస్తకాల ప్రభావం చాలా వుంది. కాబట్టి పాఠ్యాంశాలు నిర్ణయించే టప్పుడు రాజ్యాంగం విలువల్నే ప్రచారం చేయాలి. దానికి భిన్నమైన విలువలు ప్రచారం చేస్తే మనము ఆశించిన పౌరుడు తయారుకాడు.

అంటే ప్రజాస్వామిక వ్యవస్థను గౌరవించే వారుగా అవ్వాలన్నా లేక లౌకికవాదిగా కావాలన్నా లేక సోషలిస్టు భావాలు రావాలన్నా వీటిని ప్రతిబింబించే పాఠ్యాంశాలే కావాలి. వీటికి భిన్నమైనటు వంటి పాఠ్యాంశాలు ప్రవేశపెట్టి, రాజ్యాంగ విలువలు రావాలంటే రావు. ఈ యాభై సంవత్సరాలుగా చేసిన తప్పు అదే! డియస్ రెడ్డి అనే విద్యావేత్త సోవియట్ పర్యటనకెళ్లినపుడు ఒక క్లాసుకి వెళ్ళి, “ఒక వ్యక్తి 60 రూబుళ్ళకి ఒక గుర్రం కొని 70 రూబుళ్ళకు అమ్మాడు. లాభం ఎంత?” అనడిగాడు. వెంటనే ఆ విద్యార్థి “ఆరునెలలు జైలుశిక్ష” అన్నాడు. అంటే పాఠ్య పుస్తకాలు ఆ భావాలను, విలువలను చెప్పాయి. అదే మన దేశంలోపట పాలల్లో నీళ్ళు, బియ్యంలో రాళ్ళు కలపడం, అంటరానితనం ప్రచారం చేయడం, విద్యా వ్యాపారాన్ని చేయడం సర్వసామాన్యమై పోయింది. మన రాజ్యాంగంలో నిర్దేశించిన విలువలు పుస్తకాల వరకే ఉండిపోయాయన్నమాట!

చుక్కా రామయ్య

మన అతిథి గురించి...

పుట్టిన ఊరు	: వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం, గూడూరు
తేది	: 20 నవంబర్, 1928
విద్య	: ఎం.ఎస్.సి. మేథమెటిక్స్ (ఉర్దూ మీడియం)
వృత్తి	: అధ్యాపకుడు
నచ్చిన వ్యక్తి	: పుచ్చలపల్లి సుందరయ్యగారు
నచ్చని అంశం	: సోమరితనం
హాబీలు	: చదవడం

పిల్లల్లో విలువలు అకస్మాత్తుగా రావు. విలువలు చాలా వరకు తల్లిదండ్రుల నుంచి లేక స్నేహితుల నుంచి లేక ఉపాధ్యాయుల నుంచి దేశరాజకీయ నాయకుల నుంచి అనుకరించబడతాయి. కాబట్టి పిల్లవానికి వారి జీవితాలు కనబడని బోధనాంశమే (హిడెన్ కరికులమ్). మా కాలంలో దేశానికోసం త్యాగం చేసిన వారిని కళ్లారా చూశాం. దేశం కోసం సర్వస్వం త్యాగం చేయడాన్ని చూశాం. వారి ప్రభావాలు మా జీవితంపై పడ్డాయి. కాబట్టి వారి జీవితాలు మా మీద కొన్ని విలువలు ఏర్పరిచాయి.

ఈనాటి విద్యార్థుల్లో ఉన్న విలువలు చూస్తుంటే...దానికన్నా

ఈ సంచికలో...

టపా ... 2
మనసా తెలుసా ... 3
సలహాలు ... 5
నేర్చుకుందాం..రా! ... 7
సీరియల్ ... 8
క్యాంపస్ ఛాట్ ... 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
తెంగ్లీషు ... 20

ఇంటి సంగతులు.. 6
వావ్... ఫ్లవర్‌వాజ్

ఇంకా,,,



అనుబంధానికి వెల ఎంతో
కథ ... 18

ఓ ఊరి కథ.. 21
గొర్రెకుంట

ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే వాతావరణం...
ఆరోగ్యం... 17

పప్పెట్ ఇంటర్వ్యూ ... 19
టర్నింగ్ పాయింట్ ... 22
విజ్ఞానవీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24

టపా



కవర్‌స్టోరీ

ఉబకాయం వల్ల వచ్చే ఆరోగ్యప్రమాదాల గురించి చాలా విశ్లేషణాత్మకంగా సమాచారాన్నందించారు. "వెయిట్ మిషన్‌కే కాదు దేశానికీ..." అంటే భూమికి కూడా. అందుకే మనం వయసుకూ, ఎత్తుకూ సరిపడా బరువుండేట్టు జాగ్రత్తపడాలి. ఆనక బోర్లా పడితే మళ్లీ లేవడం కష్టం.

-బి. జేశ్వర్, పొన్కల్,
అదిలాబాద్

'ఉబకాయం' కవర్ స్టోరీలో పిల్లలు ఏది తినాలో నిర్ణయించే అధికారం బడా కంపెనీల చేతుల్లో ఉంటోందని, అదే ఉబకాయానికి దోహదపడుతోందని చెప్పిన తీరు ఎంతో అభినందనీయం. కవర్ పేజీ మేకప్ ఎంతో ఆకర్షణీయంగా ఉంది.

-కె. హేమలత, కడప



రియల్ స్టోరీ

పెదరాయుడు రియల్ స్టోరీ బాగుంది. ఈ కాలంలోనూ కోర్టులో పరిష్కారం కాని ఎన్నో వివాదాలను పరిష్కరిస్తూ... ఇరువర్గాలవారిని సమన్వయపరచి న్యాయమూర్తి అనిపించుకున్న సాహూ అభినందనీయుడు. ఆయన చెప్పిన తీర్పునంగీకరించి, న్యాయమూర్తి స్థానాన్నిచ్చి గౌరవించిన గ్రామస్థులూ అభినందనీయులు.

జీవనశైలి-'వాళ్లు బతికేదెట్లా'-షాపింగ్ పేరుతో అనవసర వస్తువుల కొనుగోలు మంచిది కాదని తెల్పింది.

బాలలకథ ఎత్తుకుపై ఎత్తు బాగుంది. దంత సంరక్షణ క్విజ్ ప్రత్యేకంగా ఉంది.

ఎస్.కె. జహంగీర్
విడవలూరు, నెల్లూరుజిల్లా.

నాకెంతో నచ్చింది

'పెదరాయుడు' రియల్‌స్టోరీ నాకెంతో నచ్చింది. సమాజంలో పేరు ప్రఖ్యాతులున్న వారి గురించే కాక ప్రతిభావంతులైన ఎందరో వ్యక్తుల్ని పరిచయం చేస్తున్నారు. సంవత్సరాల తరబడి న్యాయస్థానాల చుట్టూ తిరుగుతూ కాలాన్నీ, డబ్బునూ వృథా చేయకపోవడం నిజంగా ప్రశంసనీయం. ఇది పాఠకులు స్పందించే విధంగా ఉంది. ఇలాంటి వ్యాసం చదివి సమాజంలో కొందరైనా చైతన్యవంతులవుతారని, సామాజిక స్పృహతో కార్యాచరణకు పూనుకుంటారని ఆశిస్తున్నాను.

జి.వి. నరసింహరాజు
రామకృష్ణాపురం, రంగారెడ్డి జిల్లా.



సందేశాత్మకం

'ప్రేమ' కథలో ఆర్థిక పరిస్థితులు మనుషులనేవిధంగా కుంగదీస్తాయో కళ్లకు కట్టినట్టుగా చెప్పిన తీరు బాగుంది. ప్రేమ కోసం ప్రాణాలను తీయడానికి సైతం వెనుకాడని ఈ రోజుల్లో ప్రేమించిన వారి బాగును కోరుకోవడమే నిజమైన ప్రేమని చెప్పిన తీరు యువతకు సందేశాత్మకం.

కె. హిమ శంకరాచారి,
కడప

ఆకట్టుకుంది

ఆదివారం అనుబంధంలో "మ్యారేజీ లుక్స్" అనే రచన ఎంతో సున్నితంగానూ, సందేశాత్మకంగానూ ఉంది. వర్ణన, హాస్యం, సందేశం ఇవన్నీ కలగలిపి ఎంతగానో మమ్మల్ని ఆకట్టుకున్నాయి.

-జె. శ్రావణి, కొత్తగూడెం

చక్కగా చిత్రీకరించారు

'ఇంతి సంగతులు'లో "మ్యారేజ్ లుక్స్" సందేశాత్మకంగా ఉంది. ముఖ్యంగా బామ్మ, మనవరాలి మధ్య అనుబంధాన్ని చక్కగా చిత్రీకరించారు. నేటితరం కోల్పోతున్న ఉమ్మడి కుటుంబంలోని ఆత్మీయతను తెలియజేశారు. ఈ తరం ఆడపిల్లలు జీవిత భాగస్వామినెలా ఎన్నుకోవాలో అన్యాపదేశంగా సందేశమివ్వడం చాలా బాగుంది.

సి. హెచ్. సీత, కొత్తగూడెం
ఖమ్మం జిల్లా.





టీనేజ్ మేనేజ్‌మెంట్

హిప్నో కమలాకర్

"ఈ కాలపు కుర్రాళ్ళకు అస్సలు బుద్ధిలేదు. విలాసాలకు బాగా అలవాటు పడ్డారు. పెద్దవాళ్ళంటే గౌరవం లేదు. లేచినిల బడాలన్న మర్యాద కూడా తెలియదు. వీళ్ళని అదుపు చేయడం కష్టం"

-సోక్రటీస్

కొత్తగా చివురులు తొడిగిన లతలా, పెనవేసుకు పోతూ, అందమయిన పూరేకులను విప్పార్చుకుని, దాంతో బాటే ఇంకెంతో అందమయిన ఊహలను పెంచుకుంటూ ప్రకృతికి కొత్తశోభను కల్గించే వసంత ఋతువు లాంటి కాలం టీనేజ్. చినుకు చిందినా, గాలి తెమ్మెర చెంపలను తాకుతూ పలకరించినా, గోదావరి నీటి గలగలలు వింటున్నా, మధురమైన భావనలు మనసంతా అల్లుకునే కాలం ఈడొచ్చిన కాలం. ఊహలు, మధురోహలు జంటగా పెనవేసుకుని స్వప్న సౌధాలను నిర్మించుకునే సుందరమైన సమయం ఇది. స్వచ్ఛతను, నిష్కపటతత్వాన్ని మాత్రమే దర్శిస్తూ, ప్రకృతిలో ప్రకృతిగా కలిసిపోతూ, జీవితాన్ని రసరమ్య భరితమైన రసవద్ఘటనగా భావిస్తూ, హృదయ స్పందనలతో ప్రతిస్పందిస్తూ, ఆనందంగా, హుషారుగా గడిపే కాలం టీనేజ్. బాల్యపుఛాయలను వీడి, సీతాకోకచిలుకలా రంగురంగుల సౌందర్యాన్ని సంతరింపచేసుకొనే దశ ఇది. పాతవి అన్నీ ప్రయోజన రహితమైనవని, నవీన భావనలకు తెర తీయడానికి వెనుకాడని వయసు ఇది. ఎగరటమెలాగో తెలియకపోయినా, కలల ప్రపంచంలో ఒక విహంగంలా, హాయిగా, ఆనందంగా, అనంతమైన సుదూర తీరాలకు ఎగిరిపోవాలనే స్వతంత్ర భావాలకు ఇది ప్రారంభదశ. దిశా నిర్దేశం కాకపోయినా, అదేదో తమంతటతామే తేల్చుకుని పగ్గాలు చేతపట్టుకోవాలని తపించే దశ. తమను నిర్దేశించే కంఠాలు, నియంతృత్వ శాసనాలుగా వినిపించే సమయం ఇది. ఎదిగే మొక్కను ఉక్కు పాదం క్రింద అణిచివేస్తున్నారనే ఉక్రోషం పొదుచుకుని వచ్చి ఎవరినీ బేఖాతరు చేయని వయసు ఇది. రేపటి ప్రపంచం ఏమిటో, ఆ ప్రపంచ వీధుల్లో తమ గమ్యాలు ఏమిటో తేల్చుకోలేక, తమలో కల్గుతున్న మార్పులు అంతర్యుద్దేశ్యం ఏమిటో అంతుచిక్కక, ఏదో చేసేయాలనే అనురక్తికి దాసోహం అయిపోయే దశ ఇది.

ఎగరటమెలాగో తెలియకపోయినా, కలల ప్రపంచంలో ఒక విహంగంలా, హాయిగా, ఆనందంగా, అనంతమైన సుదూర తీరాలకు ఎగిరిపోవాలనే స్వతంత్ర భావాలకు ఇది ప్రారంభదశ.

అర్థం చేసుకోవడం కష్టం:

తల్లిదండ్రులకు టీనేజ్ వయసు అర్థం కాని ఒక పద బంధ ప్రహేళిక. ఉరకలు వేసే ఉత్సాహాన్ని "కట్టడి" చేయడమెలాగో తెలియని చిక్కు ప్రశ్న. మనస్తత్వ వేత్తలకు ఈ పరిణామ దశ ఒక పరిశోధనా వేదిక. తత్వ సూత్రాలకే సవాల్ విసిరే మనఃప్రవృత్తుల పుట్టు పూర్వోత్తరాలను విశ్లేషించమని పని కల్పించే రంగం. సమాజానికి ఇది బాధ్యతలను పెంచే వ్యవస్థ. నీతిసూత్రాల నిగ్గుతేల్చి, కొత్త మూసలను తయారుచేసుకోవల్సిన ఆవశ్యకతను గుర్తు చేసే తరం ఇది. పిల్లలకు మాత్రం ఇది అయాచితంగా అందిన పట్టాభిషేకం. పురివిప్పిన నెమలిలా ఆనంద పారవశ్యానుభూతులను పొదివి నింపుకుని ఈ ప్రపంచాన్నే జయించేసి గుప్పెట్లో పెట్టేసుకోవాలనే కాంక్షను రగిలించే సామ్రాజ్యవాదం. అదే టీనేజ్ గొప్పదనం.

నిర్వచనం: ఒక మనస్తత్వవేత్త యవ్వనత్పూర్వ దశను ఇట్లా వర్ణిస్తాడు.

పిల్లలు, పిల్లల్ని కనేస్థితిని ఏర్పరుచుకోవటానికి మారేదశనే యవ్వనత్పూర్వదశ అని ఆయన ఆంగ్ల ప్రవచనానికి అనువాదం. ఈస్టేట్‌మెంట్ చాలా సింపుల్‌గా కన్పిస్తుందిగానీ, ఇట్లా మార్పు చెందటానికి ఎన్నోదవలు వుంటాయి. అవ్వన్నీ పిల్లల్లో కన్పిస్తుంటాయి. శారీరక ధర్మాలు మారతాయి. మానసిక ధర్మాలలో మార్పు ఏర్పడ్తుంది. అట్లాగే వారి ఆలోచనల్లో మార్పు వస్తుంది. ప్రవర్తన, ఉద్వేగాలు... ఇలా ఒకటేమిటి... చివరికి వారి గొంతుతోసహా అన్ని మారిపోతూ వుంటాయి. దీనికి తోడు పాశ్చాత్య ప్రభావం ఒకటి!

కట్టడిచేయడం ఎలా?

టీనేజ్ సమస్య ఈ నాటిది కాదు. ప్రాచీన కాలం నాటిది. తరతరాల నాటిది. తమకు ఒక భారమైన సమస్యగా తయారైందని వాపోయేనేటి తల్లిదండ్రులు ఒకప్పుడు, వాళ్ళ టీనేజ్‌లో వున్నపుడు సృష్టించిన సమస్యే ఇది. కట్టిపడేసి కట్టడి చేయడం ఒక్కటే దీనికి సరైన పరిష్కారమని, తల్లిదండ్రులు పూర్తిగా నమ్మిన విషయం ఇది.

ఎడాలసెన్స్ అంటే ఇది:

20వ శతాబ్దం ప్రారంభదశలో ఈ యవ్వనత్పూర్వదశను గురించి శాస్త్రవేత్తలు ఆరాతీయడం మొదలుపెట్టారు. మనిషి తన జీవితంలో యువకుడిగా మారడానికి ముందు కొంతకాలంపాటు పరివర్తనాకాలాన్ని చవిచూస్తాడని వారు కనుగొన్నారు. దీనిని ఒక ప్రత్యేకదృష్టితో పరిశీలన చేయవలసిఉందని భావించారు. అందుకు వీలుగా బాల్య, యవ్వన దశలకు మధ్యలో ఉండే కాలవ్యవధిగా దీనిని విడదీసి చూడాలని తలపోశారు. అపుడే ఈ దశకు ఒక ప్రత్యేకమైన పేరుపెట్టాలని ఆలోచన వచ్చింది. అంతకుముందు వీరిని యంగ్‌పీపుల్ అని అనడం వాడుకలో ఉండేది. అది సమగ్రతకు తోడ్పడడంలేదని చెప్పి ఈ కాలానికి ఎడాలసెన్స్ అనే పేరును ఖరారు చేశారు. దీనినే తెలుగులో యవ్వనత్పూర్వదశ అని అంటున్నాము. ఎడాలసెన్స్ మరింత సరళంగా వాడుకలోకి టీనేజ్‌గా వ్యవహరించబడుతోంది. ఈ పదం 20వ శతాబ్దం మధ్యలో వచ్చిందే. 1950కి ముందు డిక్షనరీలలో ఈ పదం లేదు. ఇపుడు పిల్లలు బాల్యదశ అయిన వెంటనే వయోజనులుగా (అడల్ట్స్) మారిపోరు. ప్యూబర్టీలోకి ప్రవేశించి టీనేజర్స్ అవుతారు. పరివర్తనా కాలంలో పిల్లల్లో ఏర్పడే మార్పులు చాలా నాటకీయంగా ఉంటాయి. అదే సమయంలో అవి కొంత గందరగోళంగాను ఉంటాయి. వీటిని అర్థం చేసుకోలేక పోవడం అనే సమస్య తల్లిదండ్రులకే కాదు మారుతూ ఉన్న దశలోనున్న టీనేజిపిల్లలకు కూడా ఉంటుంది. ఈ మార్పులు వారి జీవితానికి సంబంధించిన ప్రతీ అంశానికి వర్తిస్తాయి. వీటిని గురించి మనం ఈ శీర్షికలో వారం వారం తెలుసుకుందాం. *



ప్రజాశక్తి ఆదివారం అనుబంధంలో రచనలకు

ఆహ్వానం



జోక్స్, కార్టూన్లు

మీ క్లాస్‌రూమ్‌లో, పనిచేసే ఆఫీసుల్లో, మీరు పాల్గొన్న ఫంక్షన్లలో, రోజువారీ సంభాషణల్లో చోటుచేసుకున్న హాస్య సంఘటనలు, పేలిన జోక్స్ రాసి పంపండి. మీరు కార్టూన్‌లు కూడా గీయగలిగితే వాటినీ పంపండి.

వంటలూ-వంటకాలు



మీరు రకరకాల రుచుల్లో అనేక వంటల ప్రయోగాలు చేస్తుంటారు కదా! అలాంటి వంటకాల గురించి, ఫ్యాన్సీ వంటకాల గురించి రాసి పంపండి.

కథ

సమకాలీన సామాజిక కథావస్తువులతో కూడిన కథలు పంపవచ్చు. అయితే ప్రింట్‌లో ఒక పేజీకి మించరాదు. కథను ఎడిట్ చేసే, తగ్గించే అవకాశాన్ని , రచనకు చెందిన హామీని ఇవ్వాలి.

కాలేజీ కబుర్లు

యువతీయువకులు తమ కాలేజీ కాంపస్‌లో, క్లాస్‌రూమ్‌లో, మీ మీ స్నేహాల మధ్య మీ అనుభవాలను పాఠకులతో పంచుకోండి. క్లుప్తంగా, ఒక అరఠావుకి మించకుండా రాసి పంపండి.



చారిత్రక గ్రామాలు

మన దేశం తరతరాలుగా గ్రామీణ నేపథ్యం కలది. కొన్ని గ్రామాలకు ఎంతో చారిత్రక ప్రాధాన్యత ఉంది. అలాంటి గ్రామాలు గురించి అరఠావు మించని రచనలు, ఫొటోలు పంపండి. ప్రచురిస్తాం.

పంపవలసిన అడ్రస్సు:
ఎడిటర్, స్నేహ
ప్రజాశక్తి(దినపత్రిక),
రోడ్ నెం.1, అశోక్‌నగర్,
హైదరాబాద్ - 500 020

సలహాలు

జి.ఎల్.నరసింహారావు,
హైకోర్టు న్యాయవాది

కోర్టు వేలం ద్వారా అమ్మే అధికారముంది

మా నాన్న ప్రభుత్వ ఉద్యోగి చనిపోయి 4 సంవత్సరాలయింది. మా నాన్న చనిపోయిన రెండు నెలలనుండి మా అమ్మ మమ్మల్ని విడిచి వెళ్ళిపోయింది. ఇంతవరకూ రాలేదు. నాకు మా నాన్నగారి స్థానంలో కంపాజినేట్ గ్రౌండ్‌లో ఉద్యోగం ఇచ్చారు. మా ఇల్లు, కట్టుటకు మా నాన్న గారు లక్ష రూపాయలు ఆంధ్రాబ్యాంక్‌లో లోన్ తీసుకుని కట్టారు. మా నాన్న గారి టెర్మినల్ బెనిఫిట్స్ మా అమ్మలేని కారణంగా మాకు ఇవ్వడం లేదు. ఇప్పుడు ఆంధ్రాబ్యాంకు వారు లోన్ కట్టమని బలవంతం చేస్తున్నారు. లేకుంటే ఇల్లు అమ్ముతామంటున్నారు. మేము ఆ ఇంట్లో లేము. ఇప్పట్లో ఇల్లు అమ్మాలనుకోలేదు. మా నాన్న డబ్బులు రాగానే ఇస్తామంటే వాళ్ళు వినడం లేదు. ప్రస్తుతం రూ.75,000/- కట్టాలంటున్నారు. అందువల్ల మీరు దయచేసి బ్యాంకు వారికి గల అధికారాలు తెల్పగలరు. మా యొక్క మరియు మా అమ్మ సంతకం లేనిదే బ్యాంకు వారికి ఇల్లు అమ్ముటకు అధికారం కలదా. మా అమ్మను వెతుకుటకు చాలా రకాలుగా ప్రయత్నించాం. ఒకవేళ మా అమ్మ రాకుంటే మాకు బెనిఫిట్స్ రావా! దయచేసి తెలుపగలరు. నాకు తమ్ముడు, చెల్లెలు కలరు. ఇంతవరకు పెన్షన్ రాలేదు. అన్ని అధికారాలు మా అమ్మవే అంటున్నారు. సలహా ఇవ్వగలరు.

యం. జగదీశ్వర్
మహబూబ్‌నగర్‌జిల్లా.

☛ మీ నాన్నగారికి ఇల్లు కట్టుకోవడానికి లోన్ ఇచ్చారు. కాబట్టి వారి తనఖాలోనే ఆ ఇల్లు ఉంటుంది. కావున వారు లీగల్‌గా కోర్టు వేలం ద్వార అమ్మే అధికారం వారికుంటుంది. మీ అమ్మగారి సంతకం, మీ సంతకాలతో బ్యాంకు వారికి సంబంధంలేదు. మీరు ఆ డబ్బును కట్టవలసిందే. మీ అమ్మగారు వెళ్లి 4 సం॥ అయ్యింది అంటున్నారు. చట్ట ప్రకారం 7 సం॥ ఆచూకి తెలియనట్లయితే జిల్లా కోర్టులో దావా వేసుకుని చనిపోయి ఉంటుందని డిక్లరేషన్ తీసుకోవాల్సి ఉంటుంది. అప్పుడే ఆ బెనిఫిట్స్ పిల్లలుగా మీకు పొందే అధికారం ఉంటుంది.

మీరు ఎదుర్కొనే న్యాయపరమైన సమస్యలకు అనుభవజ్ఞులైన న్యాయవాదులు సలహాలు ఇస్తారు. ఈ సమస్యలతో సతమతమయ్యే పాఠకులు తమ ప్రశ్నలను ప్రజాశక్తికి పంపిస్తే వీలువెంబడి న్యాయవాదుల సమాధానాలు ప్రచురిస్తాము.

చిరునామా :
న్యాయసలహాలు
ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్.నెం.1,
అశోక్‌నగర్,
హైదరాబాద్ - 20

శ్రమను దోచుకుంటున్నారు

మేము చీరాల ఎల్.టి.సి. ఐ.ఎల్.టి.డి. కంపెనీలో పనిచేస్తున్నాము. 1982లో కంపెనీని మూసివేసి కార్మికులన ందరినీ ఇంటికి పంపించినారు. మరలా 1985లో కొత్తగా ప్రారంభించి పాత కార్మికులనే పనిలోకి తీసుకున్నారు. 1982కు ముందు కంపెనీలో ఫోర్క్‌లిఫ్ట్ డ్రైవర్స్ పని చేస్తు ఉండేవారు. వారిని 1982 వి.ఆర్.ఎస్ ఇచ్చి వారిని ఇంటికి పంపించినారు. 1985లో ఫోర్క్‌లిఫ్ట్ డ్రయివర్స్ కంపెనీకి అవసరము 1985లో పాత కార్మికుల నుంచి ఫోర్క్‌లిఫ్ట్ డ్రయివర్స్‌గా మమ్ములను అప్లికేషన్స తీసుకొని టెస్ట్‌లో పాస్ అయిన వారిని ఫోర్క్‌లిఫ్ట్ డ్రయివర్స్‌గా పనిచేయించు కొనుచున్నారు. అయితే మాకు టెక్నికల్‌కు ఇచ్చే జీతాలు యివ్వకుండా మామూలు కార్మికులకు ఇచ్చే జీతాలు మాత్రమే ఇస్తున్నారు. మా శ్రమకు తగిన జీతాలు యివ్వకుండా మా శ్రమను దోచుకొనుచున్నారు. కార్మిక చట్టంలో పరిశ్రమలో కార్మికుని గా చేరి అతను నిత్యం చేసే పనిని గుర్తించి పనికి తగ్గిన గ్రీడ్ ఇచ్చి ఆ పనికి తగిన జీతం ఇవ్వమని ఉంది. మేము చేస్తున్న పనికి గుర్తింపు రావాలన్న పనికి తగ్గ జీతం రావాలన్న మేము ఏమి చేయాలి కోర్టుకు పోవచ్చా. ఏ కోర్టుకు పోవాలి. మేము ఏమి చేస్తే మాకు న్యాయం జరుగుతుంది. సలహా ఇవ్వగలరు. 1985 తరువాత డైరెక్ట్‌గా డ్రైవర్లుగా పని చేస్తున్నవారు 85 మంది. మాకు మంచి న్యాయసలహా ఇస్తారని కోరుచున్నాము.

షేక్ సుభాని,
చీరాల, ప్రకాశంజిల్లా.

☛ మీరు నైపుణ్యంగల పనిచేస్తూ ఉంటే మీకు "స్కిల్డ్ వర్కర్‌గా జీతం ఇవ్వాల్సి ఉంటుంది. అన్‌స్కిల్డ్ వర్కర్స్‌కు ఇచ్చే జీతాలే మీకు ఇస్తున్నట్లయితే మీరు మీ జిల్లాలోగల మీకు సంబంధించిన అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ని కలవండి వారికి అర్జీపెట్టుకుంటే మీకు తగు 4.0 ప్రకారం చట్టపరంగా రావలసిన జీతం ఇప్పించగలరు.

<u>క్రీడల మంత్రి</u>
డాక్టర్:- మీకు మోకాళ్ళ నొప్పులు బీపీ, షుగర్, దగ్గు, ఆయాసం ఉన్నాయి. మీరు ఆరోగ్యం విషయంలో జాగ్రత్తవహించాలి. అన్నట్టు మీరు ఇప్పుడు ఏ శాఖామంత్రిగా ఉన్నారు?
మంత్రి:- క్రీడలు యువజన సర్వీసులు... ఖళ్...ఖళ్...

ఇంటి సంగతులు

హిమ

వావ్... ఫ్లవర్‌వాజ్

సోఫా...దివాన్...టీ పాయ్... దానిమీద ఫ్లవర్‌వాజ్ లో నవ్వుతూ పలకరించే గులాబీలు... చూడగానే 'అబ్బ...ఈ పూలెంత అందంగా ఉన్నాయ్' అని అనుకోని వారుండరు. ఇలా ప్రతివారినీ ఆకర్షించేలా... ఫ్లవర్‌వాజ్‌ను, దానిలోకి పూలను ఎంపిక చేసుకోవడం, అవెప్పుడూ తాజాగా ఉండేలా చూసు కోవడం గది అలంకరణలో ఎంతో కీలకం.

గదిలో ఓ టీపాయ్...దాని మీద ఓ ఫ్లవర్ వాజ్ ఉంచితే చాలు...చూపరులను అమితంగా ఆకర్శిస్తుంది. ఈ రోజుల్లో మహిళలు ఉద్యోగం, ఇంటిపని రెండూ చేయడంలో తలమునకలవు తున్నారు. అందుకే ఫ్లవర్ వాజ్‌లలో పూలు ప్రతిరోజూ మార్చడం...వాటిని అలంకరిం చడం...ఎందుకీ తలనొప్పి...అనుకుని చాలా మంది కృత్రిమపూలు, ఆకులను తెచ్చి ఫ్లవర్‌వాజ్‌లలో సర్దేసి ఒక భారం దిగిపోయినట్లుగా ఫీలవుతారు. కానీ సహజసిద్ధమైన అందం ముందు ఇవి దిగదుడుపే. ఎంత ఖరీదు పెట్టి కొన్నా వీటికా అందం, తాజాతనం తెప్పించదలమా?! ప్రతిరోజూ సృజనాత్మకంగా అలంకరించడంలో కొంత సమయం వృథా అయినా సహజమైన పూలే చూడడానికందంగా ఉంటాయి. చక్కటి సౌరభంతో మనల్ని సేదతీరుస్తాయి. కాదంటారా చెప్పండి? ప్రతిరోజూ ఫ్లవర్‌వాజ్‌లోకి ఏ పూలు తేవాలి? ఇదేనా మిమ్మల్ని వేధిస్తున్న ప్రశ్న. ఏపూలైనా పనికొస్తాయి. కాకపోతే మీ సృజనాత్మకతను కొంచెం జోడించాలంతే. వాతావరణ కాలుష్యం మితిమీరిపోతున్న ఈ రోజుల్లో. ప్రతి ఒక్కరూ తప్పకుండా పెరట్లో రకరకాల చెట్లూ, మొక్కలు పెంచుతూనే ఉంటారు. మీ పెరట్లో లభించే పూలు, ఆకులు కొమ్మలు కత్తిరించి ఫ్లవర్ వాజ్‌లో సర్దేయండి. ఎందుకంత కోపం. ఓహో! మీరెంతో ఇష్టంగా పెంచుకున్న మొక్కలను కోయమన్నం దుకా?! సరే మీకు మీ పెరడును పాడు చేయడం ఇష్టం లేదు. అయితే ఫ్లోరిస్ట్ దగ్గరకెళ్లి మీకు కావాల్సిన పూలు కొనుక్కోవచ్చు. దీనికి ముందే ఫ్లవర్‌వాజ్‌లు సిద్ధం చేసుకోవాలి మరి. ఆతరువాత వాటి ఆకారానికి తగిన రీతిలో పూలు కొనుక్కోవాలి.

ఫ్లవర్‌వాజ్‌లు సిద్ధం చేసుకోవడం మేమిటా అనుకుంటున్నారా? నేడు మార్కెట్‌లో రకరకాల ఫ్లవర్ వాజ్‌లు దొరుకుతున్నాయి. మొగ్గ ,సిలింద్రికల్ , చేపల తొట్టె ఇలా వివిధ ఆకారాల్లో ఫ్లవర్ వాజ్‌లు మాకు మేమే సాటి అని పోటీపడుతున్నాయి. వాటిలో సెరామిక్ ఫ్లవర్ వాజ్‌లు డ్రాయింగ్ రూంకెంతో శోభనిస్తాయి. ఇలా రకరకాల ఫ్లవర్ వాజ్‌లను కొనడానికే డబ్బంతా ఖర్చు చేయాలా అనుకుంటున్నారా? అయితే మీ ఇంట్లో మినరల్ వాటర్ బాటిల్స్, సాఫ్ట్‌డ్రింక్ బాటిల్స్ ఉండేఉంటాయి. అవునా? మరింకెందు కాలస్యం వాటినే ఫ్లవర్‌వాజ్‌లుగా ఉపయోగించవచ్చు. అయితే వీటిని ఒక్కొక్కటిగా కాక రెండు మూడు రంగులలో ఉన్న బాటిల్స్ తీసుకుని అందులో పూలు సర్ది ఒక చోట ఉంచాలి. అప్పుడు చూడడానికి అందంగా ఉంటుంది. రకరకాల ఆకృతులల్లోని ప్లాస్టిక్ వస్తువులను ఫ్లవర్ వాజ్‌లుగా వాడాలను కుంటున్నారా? అయితే ఈ జాగ్రత్తలను పాటించండి.

ఫ్లవర్ వాజ్ వెడల్పుగా ఉందా...

వీటిలో ఒక కొమ్మో, పూవో పెడితే అందంగా ఉండదు. వాజ్ పొడవుకి తగ్గట్టుగా కొమ్మలు కత్తిరించి వాజ్‌ను పూర్తిగా నింపేయండి. చాలాఅందంగా ఉంటుంది. కొమ్మలు పొట్టిగా ఉన్నప్పుడే ఈ రకమైన ఫ్లవర్‌వాజ్ వాడాలి. ట్యులిప్ వంటి పూలు ఈ వాజ్‌లో వాడాలి.

సిలిండర్ షేపయితే...

వీటిలోననూ పొడుగాటి కొమ్మలు, పూలు సర్దితే బాగుంటుంది. ఒక్కొక్క పూవును ఆకుతో సహా ఫ్లవర్ వాజ్‌లో అమర్చొచ్చు.. వాజ్‌లోపల కొన్ని గులకరాళ్లు వేయవచ్చు. ఈ ఆకృతిలోని ఫ్లవర్ వాజ్‌లు ఏ గదిలో ఉంచినా ఆకర్శిస్తాయి.

పొడుగాటి ఫ్లవర్‌వాజ్...

ఫ్లవర్‌వాజ్ సన్నగా, పొడుగ్గా ఉన్నప్పుడు పొడుగాటి కొమ్మలుంచాలి. ఒకటి రెండు పొడుగాటి కొమ్మలు, ఆ కొమ్మలకు పూలు ఇలా సర్దితే ఫ్లవర్ వాజ్ చూడడానికి బాగుంటుంది. గదికి ఎంతో అందం వస్తుంది. ఈ రకమైన వాజ్‌లో ఒక్క పూవు ఉంచినా ఆకులు పెట్టడం మర్చిపోకూడదు. ఏ పువ్వయినా ఆకుతో పాటు సర్దితేనే అందం వస్తుంది. అలాగే పొడుగాటి గడ్డి పరకలు తీసుకుని వాజ్‌లో ఉంచితే మరింత బాగుంటుంది. లిల్లీ పూలు సర్దడానికి ఈ రకమైన ఫ్లవర్ వాజ్‌లు బాగా సూటవుతాయి. *

నేర్చుకుందాం...రా!

ఫ్యాబ్రిక్ పెయింటింగ్ ఎలా...?

అగస్త్యరాజు లక్ష్మీ సూర్యకళ

ఈ మధ్య కొంతకాలంగా ఫాబ్రిక్ పెయింటింగ్ ఎంత ప్రాచుర్యం పొందిందో చెప్పవలసిన పనిలేదు. కాలేజీ స్టూడెంట్స్, ఉద్యోగినులు, గృహిణులు "ఫ్యాబ్రిక్ పెయింటింగ్ పై ఎక్కువ మక్కువ చూపుతున్నారు. కాదేది కళకనర్హం అన్నట్లు ఫాబ్రిక్ పెయింటింగ్ లో భాగంగా జలజల పారే సెలయేర్లు, రంగురంగుల సీతాకోకచిలుకలు, రంగురంగుల పూవ్వులు, పండ్లు, జింకలు, లేళ్ళు, అమ్మాయి బొమ్మలు,- ప్రకృతిలోని అందాలన్నింటిని ఎవరి అభిరుచికి తగ్గట్లు వాళ్ళు గాగ్రామీద, పంజాబీ డ్రస్, చీరలు, టీషర్ట్ పైన వేసుకోవచ్చు. ఆదాయవనరుగా కూడా ఉంటుంది.

కాటన్, సిల్క్ చీరల మీదేకాక వెంకటగిరి. పట్టుచీరల మీద కూడా ఫాబ్రిక్ పేయింటింగ్ జరీని తోసిరాజని తన ఆధిపత్యాన్ని చూపిస్తోంది. ఇంకా చెప్పాలంటే బెడ్‌షీట్స్‌పైనా, పిల్లో కవర్స్ మరియు డోర్ కర్టెన్స్ మీదకూడా ఎక్కడచూసినా నేడు ఫాబ్రిక్ పెయింటింగ్ ప్రత్యక్షమౌతోంది.

మరి ఇంత ప్రాచుర్యం పొందిన ఫాబ్రిక్ పేయింటింగ్ చేయడం ఎలాగో నేర్చుకుందామా! ముందుగా ఫాబ్రిక్ పెయింటింగ్ చేయడానికి ఏమేమి అవసరమౌతాయో తెలుసుకుందాం.

ఒక తెల్లని కాటన్ క్లాత్(1/2 మీటర్)

కొన్ని రకాల బ్రష్‌లు (ఫ్లాట్ బ్రష్ 0–5 గల నంబర్ బ్రష్‌లు) మొదలైనవి.

ఇక బ్రష్‌ల విషయానికి వస్తే అనేక రకాలు దొరుకుతాయి. అవి ఆర్టిస్ట్ బ్రష్‌లు, రాయల్, జైనా, వెల్డన్, వెలకన్ మొదలైన కంపెనీలవి దొరుకుతాయి. బ్రష్‌లను కొనేటప్పుడు మొనదేలి పాయింటెడ్‌గా ఉన్నవాటాని ఎన్నుకోవాలి. బ్రిజిల్స్ (పోగులు) చింపిరి చింపిరిగా ఉంటే పెయింట్ చేయడానికి పనికిరావు.



0–5 నంబర్‌గల బ్రష్‌లను అవుట్‌లైన్ వేయడానికి వాడుకోవాలి.

ఇక రంగుల విషయానికి వస్తే "మెటాలిక్" నార్మల్ కలర్స్" అన్ని రంగుల్లోనూ దొరుకుతాయి. వీటిని క్లాత్ రకాన్ని బట్టి ఉపయోగించుకోవాలి. అంటే మెరుపు క్లాత్ అయితే "నార్మల్ కలర్స్‌ని" నార్మల్ క్లాత్ సిల్క్, కాటన్ మొ॥) వాటికి మెటాలిక్, "నార్మల్ కలర్స్"ను కూడా వాడుకోవచ్చు.



ఇక "సిల్లర్", కాపర్, గోల్డ్ మొదలైనవి పౌడర్ రూపంలో దొరుకుతాయి. వీటిని బైండర్ (లిక్విడ్)లో కలిపి ఉపయోగించుకోవాలి. ఇవిగాక కొత్తగా మార్కెట్‌లోకి "3డి అవుట్-లైనర్" (ట్యూబ్స్) వచ్చాయి. వీటిని అవుట్‌లైన్ పర్పస్‌కి ఉపయోగించుకోవచ్చు.

ఏంటి సంశయంలో పడ్డారు. డ్రా చేయడం, పేయింట్ చేయుడం, రాదు. కలర్ కాంబినేషన్ ఎలాగో, షేడ్స్ ఎలా ఇవ్వాలో తెలీదనేనా మీ భయం. ఈ విషయాలను వచ్చేవారం బొమ్మల సహాయంతో తెల్సుకుందాం. *

సీరియల్

'మాధవి'

మూలం : అనుపమా నిరంజన

అనుసరణ : వి. నాగరత్న

"నల్లరంగు చెవి ఉన్న తెల్లటి గుర్రాలు ఎనిమిదివందలు నాకు గురుదక్షిణగా కావాలి" అని గురువుగారు కోరారు.

ఆ కోరికను శిష్యుడెలా తీర్చాడో... సీరియల్‌గా చదవండి...

యయాతి మహారాజు ప్రతిష్ఠానపురానికి రాజు. ఆయన గొప్ప వీరుడిగా పేరుతెచ్చుకున్నాడు. యజ్ఞయాగాదులు, దానం చేయడంలో వారి చేతికి ఎముక లేదనిపించుకుంటారు. కీర్తిప్రతిష్టలు పెరుగుతాయంటే ఏది దానం చేయడానికైనా సిద్ధమే!

రాజభవనం ఊరి మధ్యలో చాలా ఎత్తైన ప్రదేశంలో ఎంతో విశాలంగా, అందంగా వుంది. దానికి ముందుభాగంలో ఆస్థాన మండపం, విశాలమైన మొగసాల వున్నాయి.

వెనుకవైపున అంతఃపురానికి ముందు సైనికులు కాపలా కాస్తున్నారు. అందులో కుడివైపున మహారాణి దేవయాని, ఎడంవైపున రాజకుమారి మాధవిల నివాసాలున్నాయి. రెండింటి మధ్యా చూడచక్కటి ఉద్యానవనం వుంది.

తోటలో రకరకాల చెట్లు, పూలమొక్కలు వున్నాయి. వాటిమీద అరుణకాంతులు ప్రసరిస్తూ, రంగురంగుల సీతాకోకచిలుకలు వాలిలేస్తూ ఎంతో ఆహ్లాదంగొల్పుతుండగా రాకుమారి మాధవి చెలికత్తెతో కలసి మెల్లగా నడుస్తోంది.

కాసేపలా నడిచి ఓ చెట్టుకిందున్న అరుగుమీద కూర్చుంది మాధవి.

అలా మౌనం వహించడం నచ్చక ఆమెని మాట్లాడించాలనే ఉద్దేశంతో "అబ్బ.. ఏం అందమమ్మా నీది, రంభా ఊర్వసులు అందగత్తెలంటారుగానీ వాళ్లు



మాత్రం నీకంటే అబ్బురంగా వుంటారా? ఎంత పొడుగాటి జుట్టే తల్లీ?! ఏ దేశ రాకుమారుడికి నిన్ను పెళ్ళాడే యోగముందో కానీ, ఆయనగారిని నీ జడతో బంధించు" అంది చెలికత్తె చారునేత్ర.

"నీకు మరీ పరాచికాలు ఎక్కువయ్యాయి" అంటూ నవ్వింది మాధవి.

కొద్దిదూరంలో వున్న ఎర్రటి మంకెనపూలని, మెట్టతామర, మందార పూలని ఎంతో ఇష్టంగా గమనిస్తోంది మాధవి. ఆమె ధరించినది కూడా ఎర్రటి పట్టువస్త్రమే. మెడలో కెంపులహారం. చేతికి మణికంకణం.

అన్నిటినీ మార్చిమార్చి చూసిన చారునేత్ర "నీకు ఎరుపంటే ఎందుకంత ఇష్టం?" అనడిగింది.

"అలా అడిగితే నేనేం చెప్పగలను నేత్రా, ఎందుకో ఎరుపులో ఎక్కువ అందం వుందనిపిస్తుంది"

"అన్నట్లు నీకో సంగతి చెప్పనా మాధవీ, మహారాజుగారు నీకోసం త్వరలో స్వయంవరం ప్రకటించనున్నారు"

"నిజమా?" అంది సిగ్గుతో స్వరం వణుకుతుండగా.

"పెద్దగా అనకండి. దేవయానిగారి చెలికత్తె హంసిని నా చెవిలో రహస్యంగా చెప్పింది. రాజుగారు దేవయానిగారితో చెప్తుండగా విన్నదట"

"ఎప్పుడు?"

"ఇప్పుడు కార్తీకమాసం కదా, మరో మూడునెలల తర్వాత మాఘంలో"

మాధవి తల వంచుకుని కూర్చుంది.

"నీ సిగ్గు కొంత దాచుకోవమ్మా, తర్వాత చాలా అవసరమౌతుంది. మొత్తం అన్ని రాజ్యాల రాకుమారుల్నీ పిలుస్తారట తెలుసా?!"

పుట్టూనే తల్లిని పోగొట్టుకున్న మాధవిని అవ్వ ఎంతో ప్రేమగా పెంచి పెద్దచేసింది. వెంటనే ఆవిడకా సంగతి చెప్పాలని ఉవ్విళ్ళూరి "మరి వెళ్దామా?" అంది.

"వెళ్దాంగానీ.. ఇంతకీ నువ్వు ఎలాంటి రాకుమారుణ్ణి కోరుకుంటున్నావు?"

"నేత్రా, నన్ను మరీ ఆటపట్టిస్తున్నావు"

"ఏంకాదు, తెలుసుకోవాలని అడుగుతున్నాను. కాస్త చెప్పమ్మా"

"ధైర్యంగా, హుందాగా, గంభీరంగా, సున్నితంగా వుంటూ ధర్మబద్ధంగా నడుచుకునేవాడై వుండాలి"

"ఇన్ని సుగుణాలున్న వ్యక్తి ఈ ప్రపంచంలో దొరుకుతాడంటావా మాధవీ?"

"ఎందుకుండడు నేత్రా? అంతేకాదు అతడు ఏకపత్నీవ్రతుడై వుండాలి. నన్ను తప్ప మరో స్త్రీని కన్నెత్తి చూడకూడదు"

"హయ్యో రామ, అలాంటి వ్యక్తి దుర్భిణివేసి చూసినా కనిపించడు. అయినా రాజుల సంగతి మనకి తెలీదా? ఎంత ఎక్కువమంది భార్యలుంటే అంత గొప్పనుకుంటారు కదా!"

"ఉహూ, నా రాకుమారుడు అలా వుండడు"

"ఇప్పుడే 'నా' అనేస్తున్నావు, రేపు పెళ్ళయ్యా ఇంకేమంటావో?!"

వాళ్ళలా ముచ్చటించుకుంటుండగా లతా మంటపద్వారంలో ఎవరో నిలబడినట్లు నీడ మెదిలి ఇద్దరూ తలెత్తి చూశారు.

"రాకుమారికి శుభం జరగాలి. మహారాజుగారు కబురు పంపారు. మిమ్మల్ని వెంటనే తీసుకురమ్మన్నారు" అంది అక్కడే నిలబడిపోయిన దాసి.

చారునేత్ర, మాధవి - ఇద్దరూ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

'తండ్రి తనకెప్పుడూ రమ్మని కబురుపెట్టలేదే. ఇదేం వింత?! ఇప్పుడు చారునేత్ర చెప్పినట్లు స్వయంవరం గురించి వివరించడానికయ్యుంటుంది. లేదా ఎవరైనా రాకుమారుడొచ్చాడేమో' అనుకుని "తండ్రిగారితో ఎవరున్నారు దాసీ?" అనడిగింది మాధవి.

దాసి ముఖం ఎందుకో ప్రసన్నంగా లేదు. దేనిగురించో బాధపడుతున్నట్లుగా వుంది. 'తండ్రి సంగతి తెలియందేముంది? ముక్కోపి కదా. దాసిపై ఎందుకో కోపమొచ్చి తిట్టివుండచ్చు' అనుకుంది మాధవి.

"ఎవరో ముని వచ్చాడు" అంటున్న దాసి కంఠంలో దిగులుచూసి మాధవి ఆశ్చర్యపోయింది.

'మునుపు ఎవరైనా మునిపుంగవులు వచ్చినా ఆశీర్వచనం తీసుకునేందుకు దేవయానికి మాత్రమే పిలుపు వెళ్లేది. తండ్రి తనకెప్పుడూ ఆపాటి అదృష్టాన్ని కూడా కలుగజేయలేదు. ఇప్పుడీ వింతేమిటి?' అని ఆలోచనలో పడిన మాధవిని తేరిపారచూసింది చారునేత్ర.

"అంతగా ఎందుకు సందేహిస్తున్నావు మాధవీ? నేను ఇందాక చెప్పిన విషయం గుర్తులేదా? ఒకవేళ అందుకేనేమో. రుషుల ఆశీర్వాదం అందరికీ దొరకదు, త్వరగా నడువు" అంది చారునేత్ర.

మాధవి ఇక ఆలశ్యం చేయకుండా లేచింది.

ముందు దాసి, ఆమె వెనుక మాధవి, ఆపక్కనే చారునేత్ర నడుస్తూ సమాలోచనా మందిరం చేరారు.

దాసి, మాధవి లోనికెళ్లగా, చారునేత్ర తలుపు పక్కగా నిలబడి లోనికి పరికించసాగింది.

మాధవి మొదట తండ్రికి, ఆనక అక్కడున్న మునికి నమస్కరించింది.

యువకుడైన మునికి ఆమెని చూడగానే ఆ ముగ్ధమోహన సౌందర్యానికి కళ్లు చెదిరాయి. 'ఏం అందం? నిజంగా దేవకన్యలా వుంది. ఇందాక యయాతి చెప్పినపుడు అతిశయోక్తి అనుకున్నాను కానీ ఆ మాటలు అక్షరసత్యాలన్నమాట' అనుకుంటూ "వివాహ ప్రాప్తిరస్తు" అన్నాడు, తన కలవరపాటును పైకి వ్యక్తపరచకుండా.

"మాధవీ, ఈయన గాలవ ముని. ఈయనకి నిన్ను దానం చేశాను. ఈ క్షణంనుంచీ నువ్వు ఆయన సొత్తు" అన్నాడు యయాతి.

అప్పటివరకూ ఏవేవో మధురమైన ఊహల్లో వున్న మాధవి నిర్ఘాంతపోయింది.

ఎవరీ గాలవ ముని? తన కూతురని చూడకుండా యయాతి మహారాజు దానంగా ఎందుకిచ్చాడు? అలాంటి వింత గురుదక్షిణ కోరిన గురువు ఎవరు? రాబోయే సంచికలో...

క్యాంపస్ ఛాట్

హాయ్... న్యూ కమర్...

కె. శివలీల

సీరియస్‌గా పేపర్ చదువుతున్న ఓ కుర్రాడు ఉన్నట్టుండి హుర్రే...! అని అరిచాడా?! కారణమేంటని అడుగుతున్నా వినిపించుకోకుండా "క...క..కాలేజ్ స్టైలే..." అని పాడుకుంటూ వెళ్లిపోయాడా? కొత్త సినిమానో, ఫ్యాషనో పేపర్లో చూసుంటాడని మీరు సరిపెట్టుకున్నారు కదూ? మీరూహించింది నూటికినూరుపాళ్లూ సరికాదు. ఎందుకంటే... ఈ అబ్బాయి పేపర్లో చూసిందవేవీ కాదు. ఇతను చూసింది తమ కాలేజ్ ఫలానారోజుకి ప్రారంభమవుతుందన్న ప్రకటన. ఇందులో అంత ఆనందించాల్సిందేముంది?! అని ఆశ్చర్యపోతున్నారా. అందరి దృష్టిలో ఇది మామూలు విషయమే. కానీ... కాలేజీలు ఎప్పుడు తెరుస్తారా? అని ఎదురుచూసే కుర్రకారుకి మాత్రమీవిషయం ఖచ్చితంగా నూతనోత్సాహాన్నే నింపుతుంది. ఫ్రెషర్స్‌కయితే మరీ ఆనందాన్నిస్తుంది. కొత్త కాలేజీ...సరికొత్త వాతావరణం... తల్చుకుంటేనే వారి మనసులో ఆనందం వెల్లివిరుస్తుంది. కాలేజీలోకి అడుగుపెట్టగానే...తామేదో కొత్త ప్రపంచంలోకి అడుగుపెట్టినట్లు...అది తమకే స్వంతమైనట్లు...తమకెవరూ ఎదురులేనట్లు వీరు అనుభూతి చెందుతారు. కానీ... ఉరకలేస్తున్న వీరి ఉత్సాహానికి అడ్డుకట్టపడేదో విషయం దగ్గరే. ఎక్కడా అని ఆలోచిస్తున్నారా?. అదేనండీ ర్యాగింగ్! దీని పేరు వింటూనే ఫ్రెషర్స్ మనసులో అలజడి మొదలవుతుంది. కాలేజీలో మాకెదురేలేదని భావించే వీరికి 'మీకన్నా పైన మేమున్నామంటూ' గర్తొచ్చేవిధంగా సీనియర్స్ చేసే

ర్యాగింగ్ సీనియర్స్, జూనియర్స్ మధ్య స్నేహానికి నాందిపలకాలి. మనసుల్ని గాయపరచకూడదు. అందమైన భవిష్యత్తు అర్థాంతరంగా ఆగిపోవడానికి దోహద పడకూడదు. అప్పుడప్పుడే కాలేజిలోకి అడుగుపెడుతున్న ఫ్రెషర్స్‌కి కాలేజ లైఫ్ పీడ కలలా మిగలకూడదు.

ర్యాగింగ్... వీరి గుండెల్లో గుబులు రేపుతుంది. ఈ నేపథ్యంలో ర్యాగింగ్‌ని సరదాగా ఎంజాయ్ చేయాలనుకునే జూనియర్స్ కొందరైతే... ఆ పదం వింటూనే "వద్దు బాబోయ్... మొదటి నెలరోజులూ కాలేజీ జోలికే వెళ్లం" అని భయపడే వారు మరికొందరు. ఈ పరిస్థితులలో ర్యాగింగ్‌పై కాలేజీ విద్యార్థుల భావాలూ అనుభవాలూ ఏవిధంగా ఉన్నాయో చూద్దాం."ఇంట్లో ఉండీ ఉండీ బోర్ కొడుతుంది. కాలేజీలు ఎప్పుడు తెరుస్తారా అని ఎదురు చూస్తున్నా. ఈ రోజులన్నీ త్వరగా గడిచిపోతే బాగుండు. ర్యాంగింగ్ పేరుతో జూనియర్స్‌ని సీనియర్స్ ఏడిపించడం మొదట్లో మామూలే. దీన్ని నేను లైట్‌గానే తీసుకుంటా. ఇప్పుడు మిస్సయితే మళ్లీ ఎప్పుడూ ఈ రోజులు రావుకదా" అని అంటోంది సరిత.

"ఇంతవరకూ కాలేజ్ ఎప్పుడు తెరుస్తారా అని ఎదురుచూశా. తీరా రోజు దగ్గరపడే కొద్దీ నాకు ఆందోళనగా ఉంది. ర్యాగింగ్ చేస్తారేమోనని భయంగా ఉంది. సీనియర్స్, జూనియర్స్ ఏ అరమరికలు లేకుండా కలిసిపోయేది ర్యాగింగ్ తోనే. కానీ అది మరీ శృతి మించకూడదు" అని చెప్తోంది నిమ్మి. వీరిరువురూ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో అడుగుపెట్టబోతున్నారు.

"క్యాంపస్‌లో అడుగుపెట్టా. క్లాస్ రూం ఎక్కడో తెలీదు. ఎవరినడిగితే ఎలా రియక్టవుతారో, కాలేజీకి కొత్తని తెలిస్తే ఏడిపిస్తారేమో అని ఆలోచిస్తూ నడుస్తున్నా. ఇంతలో... నలుగుర మ్మాయిలు "ఓయ్, ఏంటీ న్యూ కమరా?" అని ప్రశ్నించారు. నేను భయపడుతూ అవునని సమాధానమిచ్చా. వాళ్లడిగిన ప్రశ్నలన్నింటికీ వినయంగా జవాబిచ్చా. అప్పటి వరకూ సీరియస్‌గా ప్రశ్నించిన వారు పెద్ద పెట్టున నవ్వుతున్నారు. వారు చెప్పిన మాట విన్న నేను కూడా వారి నవ్వుతో శృతి కలిపా. ఇంతకీ విషయమేంటంటే...వాళ్లూ నాలాగా ఫ్రెషర్సే" అని ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థిని స్నేహ తెలిపారు. ఫ్రెండ్స్...జాగ్రత్త! మిమ్మల్నేడిపించడానికి సీనియర్సే కాదు ఇలాంటి జూనియర్సూ ఉంటారన్న విషయం మర్చిపోకండి.

"సినిమాల్లోలాగా ర్యాగింగ్ చేస్తారేమోనని భయపడి మొదటి నెలరోజులూ కాలేజీ మానేశా. ఆ తరువాత మా స్నేహితులు చెబుతుంటే తెలిసింది అలాంటిదేమీ జరగ లేదని. నేను వాళ్ల ఆనందంలో పాలు పంచు కోలేకపోయి



నందుకు భాధగా ఉంది" అని ఉస్మానియా యూనివర్సిటీ ఎంఎస్‌సి విద్యార్థిని తులసి అభిప్రాయపడింది. సినిమాల్లో చూపిస్తున్న తీరే విద్యార్థులను భయాందోళనలకు గురిచేస్తోంది. మీరూ ర్యాగింగ్‌పై లేనిపోని అపోహలతో ఓ నెలరోజులు కాలేజ్ ఎగ్గొడదామనుకుంటున్నారా? పొరపాటునకూడా అలాంటి పనిచేయెద్దు. చాలా వరకూ సినిమాల్లో చూపించినట్లు జరగదని మనకు వీరి అనుభవాలే చెబుతున్నాయి.

ర్యాగింగ్ ఒక మధురజ్ఞాపకంగా మిగిలిపోలేగానీ...

"నేనొక ఇంజనీరింగ్ స్టూడెంట్‌ని. కాలేజీకి ఆర్టీసీ బస్సులో వెళ్లేవాళ్లం. అక్కడా సీనియర్స్ ర్యాగింగ్ చేసేవారు. అందరూ మమ్మల్ని వింతగా చూసేవారు. ఇది మాకు చాలా అవమానంగా ఉండేది. ఈ ఆలోచనలతో ఏకాగ్రత కుదరక మేం మానసికంగా చాలా ఇబ్బందిపడ్డాం" అని సౌమ్య తన అనుభవాన్ని వివరించారు. ర్యాగింగ్ సీనియర్స్, జూనియర్స్ మధ్య స్నేహానికి నాందిపలకాలి. మనసుల్ని గాయపరచకూడదు. అందమైన భవిష్యత్తు అర్థాంతరంగా ఆగిపోవడానికి దోహద పడకూడదు. అప్పుడప్పుడే కాలేజీలోకి అడుగుపెడుతున్న ఫ్రెషర్స్‌కి కాలేజీ లైఫ్ పీడ కలలా మిగలకూడదు. డీయర్ సీనియర్స్...ర్యాగింగ్ పేరుతో రాక్షస క్రీడకు స్వస్తి చెప్పడానికీ అరమరికలు లేని స్నేహానికి పునాదివేయడానికీ మీరు రెడీయేగా? సో జూనియర్స్... అర్థం లేని మీ ఆలోచనలకిక స్వస్తి చెప్పి కాలేజీకెళ్లడానికి సిద్ధంకండి మరి. *

సినిమా కబుర్లు

"ఆ కాలం స్వర్ణయుగం"

చందు

- గుమ్మడి

ఎంతో మంది నటులు వస్తుంటారు... పోతుంటారు... కానీ కొంతమందే ప్రేక్షక హృదయాలలో సముచిత స్థానాన్ని సంపాదిస్తారు. ఆ కొంతమందికి ఎంత కాలం గడిచినా ప్రత్యామ్నాయం ఉండదు. వారు వారుగానే మిగిలిపోతారు. ఆ కొద్దిమందిలో గుమ్మడి ఒకరు. నిలువెత్తు తెలుగుదనానికి నిదర్శనం గుమ్మడి. నిబద్ధత అంకితభావం, ఉన్నత విలువలు గల నటుడు. యాభై ఏళ్ల నట జీవితంలో చెప్పుకోదగ్గ తీపి గుర్తులు... చేదు జ్ఞాపకాలు.... ఆయన మాటల్లోనే...

మేము నిమిత్తమాత్రులం

'మంచి ఆశయం, అభిరుచి ఉన్న నిర్మాతలు, దర్శకులు నిర్మించిన చిత్రాల్లో నేను నటించిన ఆ కాలం స్వర్ణయుగం. అందుకు భిన్న ధోరణిలో పయనిస్తున్న ఈ కాలంలో నటించడం మానేసినందుకే నాకీ అవార్డు ఇచ్చి ఉంటారు...' ఈ మధ్యకాలంలో 'లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డు' అందుకున్న సందర్భంలో నేనన్న మాటలివి. మేధావులైన రచయితలు, దర్శకులు సృష్టించిన పాత్రలు నాకు రావడం అదృష్టం. తెరపై కనిపిస్తాము కాబట్టి ఆదరణ, కీర్తి మాకే దక్కుతుంది. కానీ మేము నిమిత్త మాత్రులం. ఆ క్రెడిట్ అంతా దర్శకులదే. 1955-1970 వరకు నా నటనా జీవితం స్వర్ణయుగం. విజయ, వాహినీ, అన్నపూర్ణ, రాగిణి, జగపతి వంటి ఉత్తమాభిరుచి గల సంస్థల్లో, అలాగే బి.యన్. రెడ్డి, ప్రసాద్, సి. పిల్లయ్య, పి. పుల్లయ్య, వేదాంతం రాఘవయ్య వంటి నిష్ణాతుల నిర్దేశకత్వంలో నటించాను.

అర్ధాంగి చూశా - కన్నీళ్ళొచ్చాయి

ఈమధ్య టీవీలో ప్రసారమయిన 'అర్ధాంగి' చిత్రాన్ని చూశా. కొన్ని సన్నివేశాలు కన్నీళ్ళు పెట్టించాయి. చూస్తున్నంత సేపూ ఆసక్తికరంగా ఉంది. వెంటనే నాగేశ్వరరావుగారికి ఫోన్ చేసి ఇలా అని చెబితే నేనూ అలాంటి అనుభూతినే పొందానని అన్నారు. ఈ చిత్రంలో అతిశయోక్తులు, ఆర్భాటాలు లేవు. చాలా సింపుల్ స్టోరీ. ఇప్పుడు ఒక్క పాటకే లక్షలు గుమ్మరిస్తున్నారు. ఇంత అవసరమా? ఒక్క పాట ఖర్చుతో ఆ రోజుల్లో సినిమా పూర్తయ్యేది. నేడు వస్తున్న చిత్రాల్లో కథేది? లేని దీన్ని కప్పి పుచ్చడానికే అలంకారాలు, ఆర్భాటాలు చేస్తున్నారు.

నేటి తండ్రులు నౌకర్లు

నాటి సినిమాల్లో హీరో(కొడుకు) చెడు మార్గంలో వెళ్తుంటే తండ్రి మందలించేవాడు. అవసరమైతే దండించేవాడు. 'కులగోత్రాలు' చిత్రంలో తప్పుదారి పడుతున్న కొడుకు(అక్కినేని)ని నేను మందలించాను. అప్పుడు పాత్రకు ప్రాధాన్యత ఇచ్చేవారు. హీరో(కొడుకు)ని తండ్రి 'ఏరా' అని అనలేని దౌర్భాగ్య పరిస్థితి నేడుంది. ఒకవేళ సందర్భానుసారం అన్నా అభిమానులకు అది రుచించని విషయం. మరి ఏవండీ అనాలా! నేటి సినిమా తండ్రులు నౌకర్లతో సమానం.


"అర్ధాంగి" సినిమాలో అక్కినేని

'వెంకయ్య', 'పుల్లయ్య' ఉంటే...

'బండి ముందు గుర్రం వెనుక' చందంగా శ్లాబ్ సిస్టమ్ తయారైంది. ఇప్పుడీ పద్ధతి రద్దయినా దీని వెనుకున్న కథ చెబుతాను. 'వెంకయ్య', 'పుల్లయ్య' ఉంటే థియేటర్లు ఫుల్ అవుతాయి అంటారు. వారి సినిమాకు కొబ్బరికాయ కొట్టిన రోజే బయ్యర్లు నిర్మాతకి డబ్బులు ఇస్తున్నారు. వీరికి ఎగ్జిబిటర్లు ఆ డబ్బునిస్తున్నారు. ఎగ్జిబిటర్ల నుండి బయ్యర్లకు, వీరి నుండి నిర్మాతకు డబ్బు చేరుతుంది. 'వెంకయ్య', 'పుల్లయ్య' ఉన్నారన్న ధీమాతో నిర్మాత పది రూపాయిలు అవసరమైన చోట వంద రూపాయిలు ఖర్చు పెడుతున్నాడు.

కొనసాగింపు వచ్చేవారం



ఏమేం వున్నాయబ్బా!



హాయ్! పైన ఒక బొమ్మ వుంది కదా! అందులో కొన్ని తినుబండారాలు, వస్తువులు, ప్రాణులు వున్నాయి. అవేంటో మీరే కనిపెట్టాలి. తర్వాత మా జవాబుతో సరిచూసుకోండే.

బాలనేస్తాలు

వీరి వీరి గుమ్మడిపండు... వీరి పేరేమి?

హాలో! ఈ వారం వీరి వీరి గుమ్మడి పండులో వచ్చినవారెవరో గుర్తుపట్టేశారా ఈమె మహిళల హక్కులకోసం భలే పోట్లాడతారు. పేరు తెలిస్తే ఇవాళే ఇప్పుడే ... కార్డు తీసుకుని రాసి మాకు పంపండి.

మా చిరునామా: **వీరి వీరి గుమ్మడిపండు**, బాలనేస్తాలు, ప్రజాశక్తి స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్ హైదరాబాద్.

26.6.05 కు సరైన సమాధానం రాసినవారు

వనమా రవివర్మ, 4వ తరగతి, ప్రైమరీ స్కూల్, పాలడుగు, ఖమ్మం పి.జయశ్రీ, 8వ తరగతి, చిలకలూరిపేట. టి.సోనీబాయి, 10వ తరగతి, సబర్మతి హైస్కూల్, ఇల్లందు, ఖమ్మం. కాలువ శ్రీతన్మయ, 3వ తరగతి, బ్రాడీపేట, గుంటూరు. ఎల్.సుధాకర్, టిక్యా తండా, తాళ్ల సింగారం, నల్గొండ. ఎం.సురేష్, 9వ తరగతి, విజయనగరం. ఆర్.లావణ్య, 7వ తరగతి, తిరుపతి, చిత్తూరు. ఎ.విజయలక్ష్మి 8వ తరగతి, లక్ష్మీపేట, ఎమ్మిగనూరు. వి.ఆంజనేయులు, 8వ తరగతి, నేషనల్ హైస్కూల్, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్. ఎస్.రఘు, 6వ తరగతి, ముధోల్, బాసర. ఎన్.శ్రీధర్, 9వ తరగతి, ఎస్‌కోట, నెల్లూరు. ఆర్.రాజేశ్వరి, 9వ తరగతి, జడ్‌పిహెచ్‌ఎస్, కరీంనగర్. కె.రాజేష్, 7వ తరగతి, గవర్నరుపేట, విజయవాడ. ఎన్.సుధాకర్, 10వ తరగతి, కాకినాడ

3.7.05 సమాధానం
సాక్షి రంగారావు

చిన్నారి చిత్రకారులు

ఆర్. సతీష్,
8వ తరగతి,
గాంధీనగర్,
నిడదవోలు,
పశ్చిమగోదావరి.

బి. యోగి గోపీనాథ్,
10వ తరగతి, జడ్‌పిహెచ్,
శావల్యాపురం.

బాల సైదులు,
10వ తరగతి,
టి.జె.హైస్కూల్.



ఆ తేడాలేంటో....!



హేయ్! చిన్నారులూ...
ఇక్కడ రెండు ఐస్ బొమ్మలున్నాయికదా. ఇవి ఎంచక్కా మంచులో ఆడుకుంటున్నట్టున్నాయి కదూ. ఈ రెండూ చూడ్డానికి ఒకేలా వున్నాయిగానీ...

కొన్ని తేడాలున్నాయి. మీరు కనీసం ఎనిమిది తేడాలనైనా కనుక్కోవాలి. అయినా మీలాంటి పిడుగులకు ఇదొక లెక్కా! వెంటనే పెన్నో, పెన్సిలో తీసుకుని ఆ తేడాలు ఎక్కడెక్కడ వున్నాయో గుర్తించండి. తర్వాత మా సమాధానంతో పోల్చి చూసుకోండే.

రంగులు పులిమేద్దాం



టింకు

బొమ్మల కథ





జవాబులు

ఏమేం వున్నాయబ్బా!

పాము, చేప, పక్షి, సీతాకోకచిలుక, తాబేలు, పిజ్జా, చాక్లెట్, విజిల్, స్కేట్ బోర్డు, పెన్సిల్, టూత్ బ్రష్, విదూషకుడి తల, లాలీపాప్, మెజీషియన్ టోపీ, పుస్తకాలు, తాత కర్ర, ఇంకా బోలెడన్ని.

ఆ తేడాలేంటో...!

మంచు బొమ్మ ముక్కు, టోపీ, మఫ్లర్, చొక్కా గుండీలు, చెట్టు దగ్గర మంచు ముద్ద, చేతిలో పార, పక్షి దాని పక్కన నక్షత్రం దగ్గర తేడాలున్నాయి. మీరూ ఇవన్నీ గమనించేశారా!

అట్టమీది కథ

వి. నాగరత్న

వంటింటి నేస్తాలు







వండి వార్చి, వడ్డించడం ఆడవాళ్ళ పని, బయటికిపోయి సంపాదించుకురావడం మగాళ్లపని అని ఒకనాటి సమాజం పనివిభజన చేసింది. స్త్రీలు కూడా ఎంతో కాలం నుంచే పొలాల్లో శ్రామికమహిళలుగా ఉన్నా, ఉద్యోగాల్లో ఉన్నా, అన్ని రంగాల్లో పురుషునితో సమానంగా శ్రమలో పాలుపంచుకుంటున్నా ఆ పనివిభజనే కొనసాగుతోంది. "అసలు వంటజోలికే పోం"..."వంటింటి ఛాయలకే పోం" అనడంలేదు. కానీ ఎన్నాళ్లీ వంటరి వంటిళ్ళు అనీ, వంటింటి శ్రమలో పాలుపంచుకునేవారు లేర్నా అని అడగటం న్యాయమే కదా! ఈ సమస్యను సామాజికోద్యమాలు బాగానే పట్టించుకున్నాయి. సమాజంలో సాధారణ జీవనంలో కూడా వంటింటి పరగణాలో కొన్ని మార్పులూ వస్తున్నాయి. వంటింటి శ్రమానందలహరి గురించి కొద్దిగా ముచ్చటించుకుందాం.

రంగనాయకమ్మగారు తన నవలాపాత్ర విమలతో 'ఈ వంటింటికి తాళమేసి ఆ తాళపుచెవిని ఎక్కడో మర్చిపోతే బాగుణ్ణు' అనిపిస్తారు. వెనకెప్పుడో కనుక ఆవిడంతటితో సరిపెట్టారు. కానీ ఇవాళున్న పరిస్థితుల్లో అటు ఉద్యోగ బాధ్యతలు, ఇటు పిల్లల పెంపకంతో సతమతమవుతున్న ఆధునిక మహిళలు అనేకమంది అసలు వంటగదుల్లేని ఇళ్ళుంటే బాగుణ్ణని కోరుకుంటున్నారు. ఇది అతిశయోక్తి కాదు. కిచెన్ ముఖమైనా చూడకుండా చికెన్లూ, పలావులంటూ హుకుంలు జారీచేసే భర్త్రాగ్రేసరులు ఒక్క క్షణం ఆ చాకిరీ అంతా చేసే భామామణిలో పరకాయప్రవేశం చేసి చూడగల్గితే అదంతే అలసట, ఆవేదనలతో కూడిన నిస్సహాయ ఇట్టే అర్థంచేసుకోగల్గుతారు. అందరూ ఎటూ పైకి అనలేరు. ధైర్యంచేసి ఏ కొద్దిమంది స్త్రీలో తమ అసహనాన్ని వ్యక్తంచేసినా ఆ భావజాలం రుచించని, సహించని మగధీరులు వారిది పొగరుబోతుతనమని, ఆడలక్షణాలు లేవని లేబుల్ వేసి ఛీత్కారంగా తీసిపారేస్తారే తప్ప మహిళలుపడే శారీరక శ్రమ, మానసికవేదనల గురించి అర్థంచేసుకునేందుకు ప్రయత్నించరు. 'ఇదేం విడ్డూరం, వంటగది లేకపోతే తిండెక్కణ్నించి వస్తుంది?' అని మూతివిరిచే బదులు తామెందుకు సాయపడకుండా రెట్టింపు శ్రమకి గురిచేస్తున్నామని



ఆలోచించుకోవాల్సివుంది.

గుడ్డిలో మెల్లనుకోదగ్గ విషయమేమంటే ఇవాళ్టి ఆధునిక సౌకర్యాలు, గృహోపకరణాలూ ఇల్లాళ్లని అలసటచెందకుండా ఆదుకుంటున్నాయి. *నడ్డివిరిగే వాకిలినుంచి* విముక్తి కల్పించి ప్రియసఖుల్లా రక్షిస్తున్నాయి. అన్నివేళలా వెన్నంటివుండి తమవంతు సహకారాన్ని అందిస్తున్నాయి.

వాటిగురించి చెప్పుకునేముందు ఒక సగటు ఇంటిని రెండునిమిషాలు పరిశీలిద్దాం.

మధు హాల్లోంచి... "ఇదిగో పద్మా, నారాయణ వచ్చాడు.. మా ఇద్దరికీ టిఫిన్ తీసుకురా" అంటూ ఓ గావుకేక పెట్టాడు.

పద్మకి చిర్రెత్తుకొచ్చినా నోరు మెదపలేదు. ఇళ్ళు మైసూర్ మహారాజా ప్యాలెస్‌లు కావుగదా. పక్కింట్లో మాటలే పక్కన నిలబడి మాట్లాడినట్లుంటుంది. ఇక వంటింట్లో మాటలు ముందుగదిలోకి వినపడవా?! ఆవేళ ఆదివారమైనా ఆఫీసుకు వెళ్లాల్సివున్నందున టిఫిన్ చేయడంలేదని ఉదయమే డిక్లేర్ చేసింది. ఏకంగా భోజనం చేయమని, లేదంటే బయట టిఫిన్ తినమని చెప్పింది. అప్పుడు అలాగేనంటూ బుర్రూపేసి వూరుకుని స్నేహితుడు వచ్చినంతలో ఏమీ తెలీనట్లు అక్కణ్ణించే పొలికేకపెడితే ఏం చేయగలదు?! ఏమన్నా అంటే అతిథిగారు అపార్థం చేసుకోగలరు.

ఫ్రిజ్‌లోంచి బ్రెడ్ తెచ్చి టోస్టర్లో అటో ముక్క ఇటో ముక్కా పెట్టి మధ్యలో ఆలూఫ్రై వేసి మూసేసి స్టవ్‌మీద కాల్చింది. సమయానికి ఈ కూర వండటం మంచిదైంది అనుకుంది. 'బ్రెడ్‌టోస్టర్ కనిపెట్టినవాడిని అభినందించాలి' అని కూడా అనుకుని ప్లేటుల్లో తీసికెళ్లి ఇచ్చింది.

నారాయణ వెళ్లిపోయాక ఇదేమిటని అడిగితే "ఆ చాల్లెద్దూ, వాడేమీ తినకుండా వూడిపడతాడని నేనేం కలగన్నానా? అయినా నువ్వు చేసిందేముంది? టోస్టర్లో పెట్టి అటోసారి, ఇటోసారి కాలిస్తే ఐపోయిందిగా. తెగ ఆపసోపాలు పడ్డావుగానీ నిజానికి కష్టమంటే నీకేం తెలుసోయ్?" అన్నాడు.

"అబ్బే నాకేం తెలుస్తుంది

దీనిపై అన్ని రకాల వేపుళ్లు చేసుకోవచ్చు. చికెన్‌కు సంబంధించిన ఆహారపదార్థాలను తేలిగ్గా తయారు చేసుకునే పరికరం. తయారు చేసే పదార్థానికి కావలసినంత ఆయిల్‌ను మాత్రమే ఉపయోగించుకుని మిగిలిన ఆయిల్‌ను తీసేయడం దీని ప్రత్యేకత. పదార్థం ఉడికిన తరువాత మిగిలిన నూనె ఆటోమేటిక్‌గా ముందున్న గిన్నెలోకి వచ్చేస్తుంది. నూనె ఆదా అవుతుంది. వేపుళ్లు తయారు చేసుకోవడం దీనిమీద చాలా తేలిక. దీని ధర 1150 రూపాయలు.



సంజయ్ కపూర్ తందూర్

మహానుభావా? తెలుగూ ఇంగ్లీషు పేపర్లు పైన లోగో దగ్గర్నుంచి అడుగున ప్రింటెడ్ అండ్ పబ్లిష్డ్ బై వరకూ చదివే సిసలైన కష్టం నీదికాదూ?!" అంది.

"అదికాదు, మా అమ్మతరంవాళ్లది నిజంగా కష్టమంటే. ఈ మిక్సీలు, వెట్ గ్రైండర్లూ వున్నాయా? నూరాలన్నా, రుబ్బాలన్నా రోలును ఆశ్రయించాల్సిందే కదా. ఒక్క అరకిలో పప్పు రుబ్బి చూడు పద్మా నా మాట నిజమని నువ్వే ఒప్పుకుంటావు"

"తమరేమో చార్లీచాప్లిన్ సీడీ పెట్టుకుని కడుపుబ్బ నవ్వుతుంటే నేను పాత్రంతో కుస్తీపడతానులే" ఉక్రోషంగా అంది రుక్మిణి.

"నువ్వు రుబ్బే సీనే సీడీకంటే పసందుగా వుంటుంది. మా ఊళ్లో రోలు చూశావుగా, నాకు నడుంవరకూ వస్తుంది. ఆ పొత్రాన్ని ఒక్క రౌండైనా తిప్పగలవా, దాన్ని ఎత్తి పక్కనపెట్టగలవా అని నాకు డౌటు"

రుక్మిణి కోపంకొద్దీ బదులుచెప్పలేదు.

"అవన్నీ చాలుగానీ కాస్తంత ఆ ఫ్రిజ్‌లో వున్న చారుగిన్నె తీసి కొంచెం వేడిచేసిస్తే ధన్యురాలినౌతాను స్వామీ. లేదంటే పెరుగన్నం తినేసి వెళ్లిపోతాను"

"అబ్బ, ఆదివారం మీటింగేమిటో" అంటూ కొన్ని చారు పింగాణీగిన్నెలో పోసి మైక్రోవేవ్ ఓవెన్లో వేడిచేసిస్తూ "చూశావా.. మొన్నో, అటుమొన్నో కాచివుంటావీ చారు. అటు ఐస్‌పెట్టెలో (రిఫ్రిజిరేటర్) పడేస్తే ఎన్నిరోజులైనా పడుంటుంది. అరనిమిషంలో వేడిచేసివ్వడానికి 'జీ హుజూర్' అంటూ ఈ నిప్పుపెట్టె (మైక్రోవేవ్). ఇందాక నాకోసం కష్టపడిపోయానని గోలపెట్టావుగా. వుండుండు, రెండు అప్పడాలు కాల్చిస్తాను" అని పరుగులాంటి నడకతో వెళ్లి అప్పడాలు కూడా మైక్రోవేవ్‌లో కాల్చి ఇచ్చాడు.

"థాంక్యూ.. నీక్కాదు, నూనె లేకుండా కాల్చగలిగే పద్ధతి కనిపెట్టినవాడికి"

"అందుకే పద్మా నేనవేది, మునుపటితరంతో పోలిస్తే ఇప్పుడు మీ ఆడవాళ్లు చేసేది శ్రమేకాదు. కాఫీ పెట్టాలంటే శుభ్రమైన బట్టతో వడకట్టేది మా అమ్మ. ఆ బట్టకంటిన పొడరును వదిలించడం కూడా కష్టమే. ఇప్పుడు హాయిగా కాఫీఫిల్టర్లొచ్చాయి. ఆపాటి శ్రమకూడా వెనకాడితే ఇన్‌స్టంట్ కాఫీ.. అంతెందుకు ప్రెషర్ కుక్కర్ వచ్చాక సగం పని తగ్గలేదూ? లేకుంటే అన్నీ విడివిడిగా ఉడికించాల్సొచ్చేది. నాకు ఊహ తెలిశాక చాలారోజులు గ్యాస్‌స్టవ్ కూడా లేదు తెలుసా? కిరోసిన్‌స్టవ్‌మీద అష్టకష్టాలూ పడి వండిపెట్టేది అమ్మ"

"ఇంకొంచెం వెనక్కెళ్తే కట్టెలపొయ్యి వస్తుంది" నవ్వుతూనే అయినా వెక్కిరింతగా అంది రుక్మిణి.

"అవును, కట్టెలపొయ్యి రోజులైతే నాజూగ్గా వుండే నువ్వు ఓ కప్పు టీ కూడా చేసివ్వలేవు పద్మా, అది మాత్రం గ్యారంటీ"

"నువ్వు నన్ను తిడుతున్నావో, పొగుడుతున్నావో అర్థం కావడంలేదు బాబూ. కానీ ఒక్క మాట చెప్పనా? అప్పుడంటే ఆడవాళ్ళు ఇంటిపట్టునే వుండేవాళ్ళు కనుక వడ్లు దంచినా, తిరగలితో పిండి విసిరినా, మండని కట్టెల్ని ఊదుకుంటూ వంటచేసినా చెల్లింది. ఇప్పుడు ఉదయానే వంటచేసి, పిల్లల్ని తయారుచేసి

ఇది విద్యుత్ సహాయంతో పనిచేసే పరికరం. దీనిలో పైనాపిల్, యాపిల్, క్యారెట్, పుచ్చకాయ జ్యూస్‌ను తేలిగ్గా తీసుకోవచ్చు. కేవలం జ్యూస్‌ను మాత్రమే బయటకు పంపుతుంది. మిగిలిన పదార్థాన్ని లోపలే ఉంచుకుంటుంది. జ్యూస్ తీయడం పూర్తయిన తరువాత మిగిలిన పదార్థాలను తీసేసుకొవచ్చు. అవసరాన్ని బట్టి మిగిలిన జ్యూస్‌ను అందులోనే ఉంచుకోవచ్చు.



జ్యూస్ ఎక్స్‌ట్రాక్టర్

రోటీ మేకర్

దీంతో చపాతి, పుల్కా, పరోటా, తంథూరి, దోశ, అమ్లెట్, ఉత్తర ప్రదేశ్ వంటకాలు చేసుకోవచ్చు. దీని ఖరీదు1250 రూపాయల నుండి 1450 రూపాయల వరకు ఉంది. ముందుగా స్వచ్ఛమైన గోదుమ పిండిని మెత్తగా కలిపి కొంతసేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. అందులో ఉన్న అధిక చెమ్మ తగ్గిన తరువాత తీసి ఉండలుగా తయారు చేయాలి. దీన్ని రోటీమేకర్‌లో ఒకవైపుగా ఉంచాలి. అప్పటికే ఇది విద్యుత్ సహాయంతో వేడెక్కుతుంది కనుక దానిపైనున్న టెప్లాన్ కోటెడ్ ప్లేటును కూడా దానిపై ఉంచి ఐదుపది సెక్లన పాటు ప్రెస్ చేయాలి. పై ప్లేటును వెంటనే తీసి రోటీని తిరగెయ్యాలి. దీంతో పూర్తిగా ఉడికిన చపాతి దానంతట అదే కిందకు వచ్చేస్తుంది. దీనిపై స్పూన్లు, కత్తులు ఇతరాత్ర గీతలు పడే వస్తువులు వాడరాదు. గీతలు పడితే చపాతి అతుక్కుపోయే అవకాశాలున్నాయి. దీని కోసం ఉడెన్‌స్పూన్‌ను వాడటమే బెటర్. గ్యాస్‌తో పోల్చుకుంటే దీనిపై వంటతయారీ చాలా తేలిగ్గా ఉంటుంది. విద్యుత్ కూడా ఆదా అవుతుంది. ఇది సరిపోయినంత విద్యుత్‌ను మాత్రమే వినియోగించుకుటుంది. చపాతిగానీ ఇతర పదార్థాలు గానీ మాడిపోవడానికి అవకాశమే ఉండదు.

మీతోబాటు మేమూ పదిగంటలకల్లా ఆఫీసులో వుండాలి. సాయంత్రం వస్తూ పిల్లల్ని కేర్‌సెంటర్నుండి తెచ్చుకుని మళ్లీ వండివడ్డించాలంటే ఒపికెక్కడుంటుంది? ఈ సౌకర్యాలుండబట్టి సరిపోయింది. లేకుంటే శక్తిచాలక ఆసుపత్రుల్లో అఘోరించాల్సిందే"

"ఛఛ, సరదాక్కూడా అలాంటి చెత్తమాటలనకు, అందుకేగా నీకు సాయం చేస్తుంటాను. ఏదో ఇవాళ ఆదివారమని బద్ధకించానుగానీ.. నువ్వొచ్చేసరికి పూరీలో, చపాతీలో చేస్తాను, రోటీమేకర్ ఎక్కడుందో చెప్పు" అనేసరికి పద్మ నవ్వుతూ రోటీమేకర్తోబాటు క్యాస్‌రోల్, హాట్‌ప్యాక్‌లు తెచ్చి డైనింగ్‌టేబుల్‌మీద వుంచింది.

❖ ❖ ❖

చూశారుగా, కాస్తంత సహృదయత, సర్దుబాటుతనం వున్న మధులాంటి మగవాళ్లయితే అంతా అలా సవ్యంగా సాగిపోతుంది.

అధునాతన గృహోపకరణాలున్నప్పటికీ క్షణం తీరికలేని ఈతరం మహిళలు ఇంటిపనిలో, వంటపనిలో సహకారాన్ని కోరుకుంటున్నారు. లేకుంటే ఇంటాబయటా చాకిరీతో అలసిపోయి ఇరవైలో అరవై వయసొచ్చినా ఆశ్చర్యమేముంది? విశ్రాంతి కరువై వయసును మించిన వృద్ధాప్యం వచ్చి మీదపడుతుంది. ఈ సత్యాన్ని గుర్తించిన కొందరు పురుషులు తమ భార్యలు యంగ్ అండ్ ఎనర్జిటిక్ ఫేసుల్తో కళకళలాడాలనే సదుద్దేశంతో పనుల్లో పాలుపంచుకుంటున్నారు. తమవంతు సహకారాన్ని అందిస్తూ భేషైన భర్తలనిపించుకుంటున్నారు.

వినియోగదారీ ప్రపంచం తమ స్వార్థంతోనైతేనేం గృహిణుల అవసరాలు గుర్తించి కొత్తకొత్త యంత్రాలను, వస్తువులను తయారుచేస్తోంది. కూరగాయల చెక్కుతీసే పీలర్ దగ్గర్నుంచి వాటిని సుఖంగా తరిగేందుకు వీలైన అంజలీ కటర్ వరకూ అలాగే రైస్ కుకర్ (ముందే బియ్యం కడిగిపెట్టుకుని, ఎప్పుడంటే అప్పుడు స్విచాన్ చేసుకోవచ్చు), మిల్క్ బాయ్‌లర్ (పాలు పొంగొచ్చేవరకూ పడిగాపులు పడకుండా విజిల్ రాగానే దింపొచ్చు), ఇడ్లీ కుకర్, కూరలు అడుగంటకుండా నాన్‌స్టిక్ ప్యాన్, పదార్థాల డిషెస్ డైనింగ్ టేబుల్ వరకూ చేర్చేందుకు ట్రాలీ.. ఇవన్నీ మన అమ్మమ్మలు, తాతమ్మలు ఊహించివుంటారా? స్నానానికి నీళ్లు వేడిచేయాల్సిన పనిని తగ్గిస్తూ గీజర్.. ఒకటారెండా, ఎన్నెన్నె ఉపకరణాలు?! లెక్కకు మిక్కిలిగా లేవూ?! అంతేనా? ఆ వస్తువులన్నిట్నీ వెతుక్కోకుండా, తడుముకోకుండా చేతికి అందేలా, అందంగా, పొందిగ్గా కనిపించేలా సర్దుకునేందుకు రకరకాల స్టాండులొస్తున్నాయి. త్వరలో డిష్‌వాషర్ లాంటి అనేక పరికరాలు మనదేశంలోనూ అడుగుపెట్టి అలరించనున్నాయి.

వాడుకలో వున్న పనిముట్లని కూడా ఎప్పటికప్పుడు సరికొత్తగా అభివృద్ధిపరుస్తూ ఇంకా సులభంగా ఉపయోగించే వీలు, అదనపు ప్రయోజనాలు చేకూరుస్తూ మరింత లాభదాయకంగా వుండేలా చూస్తూ తమ మార్కెట్‌ను పెంచుకుంటూనే మనకు సౌలభ్యాన్ని పెంచుతున్నారు.

పూర్వపు వాషింగ్ మెషిన్ కేవలం బట్టల మురికి వదిలించగా జాడించుకోవడం, ఆరేసుకోవడం మనమే చేసుకోవలసివచ్చేది. ఇప్పుడైతే అవే జాడించి, తడారిపోయేలా చేస్తున్నాయి. 'పిండికొద్దీ రొట్టె' అన్నట్లు అంతా డబ్బు మహత్యం. ధరను బట్టి సుఖసౌఖ్యాలు. ధనం గుప్పిస్తే చాలు అల్లా-ఉద్దీన్ అద్భుత దీపాలకు మల్లే యంత్రమ్మలు ప్రత్యక్షమై బోల్డంత పనిచేస్తూ ఊరట కలిగిస్తాయి, ఉషారునందిస్తాయి. ఇంట్లో ఈ సామగ్రి వుంటే ఇక చీకూచింతల ప్రసక్తే లేదు. నీరసం, నిస్పృహల ఊసే లేదు. అలసటా హంగామాల మాటే లేదు. పెనిమిటిగారు కనీసం ఆపరేటర్ అవతారమెత్తి కాస్తంత వాటితో పనిచేయించినా చాలు, ఇక చెప్పాల్సిందేముంది? ఇంటి ఇల్లాళ్ళు చిటికెలో వండిపారేసి, టీవీ ఎడ్వర్టయిజ్‌మెంట్లలో చూపినట్లు చిరునవ్వులు చిందిస్తూ వడ్డించేస్తారు. విసవిసలూ రుసరుసలూ, మచ్చుకైనా కనిపించవండీ బాబూ..

కనుక చేయాల్సిందల్లా అధునాతన గృహోపకరణాలతో ఇంటిని అలంకరించాలి. ఆపైన భార్యామణితో చేతులు కలిపి సిసలైన భాగస్వామి ననిపించుకోవాలి. ఇంకొక్క అడుగు ముందుకేసి పిల్లలు కూడా పనులందుకునేలా చేస్తే ఇక ఆ ఇల్లు నిజంగా స్వీట్‌హోమ్! ❖

శాండ్‌విజ్ రోస్టర్‌లో బ్రెడ్‌కు సంబంధించిన అన్ని రకాల వస్తువులు తయారు చేసుకోవచ్చు. రెండువైపులా ఇది హీటై ఉంటుంది కాబట్టి బ్రెడ్‌ముక్కలు చాలా తేలిగ్గా ఉడికిపోతాయి. రెండు బ్రెడ్ ముక్కల మధ్యన కొడిగుడ్డు సొనవేసి పెడితే ఆటోమేటిక్‌గా ఆమ్లెట్ తయారవుతుంది. దీనిపై మటన్, పిజ్జా, బర్గర్లు కూడా తయారు చేసుకోవచ్చు. అన్ని రకాల ఆహార పదార్థాలు తయారు చేసుకునేందుకు అనువుగా ఉంటుంది. దీని ఖరీదు 650 రూపాయల నుండి 1150 రూపాయల వరకు ఉంటుంది.



శాండ్‌విచ్ రోస్టర్

ఆరోగ్యం

డా॥ శ్యామలాంబ

వైరల్ జ్వరాలతో జాగ్రత్త

మనిషికి వచ్చే వ్యాధుల గురించి అధ్యయనం చేయడమంటే అతని చుట్టూ ఉన్న వాతావరణాన్ని గురించి అధ్యయనం చేయడమే అవుతుంది. ఎందుకంటే ప్రధానంగా వాతావరణ పరిస్థితులపైనే మనిషి ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటే మానవుడు ఆరోగ్యంగా ఉంటాడు.

అవి అనుకూలంగా లేనప్పుడు అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. ఈ అనారోగ్యానికి ప్రధానంగా నీటి కాలుష్యం, గాలి కాలుష్యం, సరైన వసతి సదుపాయాలు లేకపోవడం, జంతువుల మలం కుప్పలుగా పడి ఉండటం వంటివి సూక్ష్మజీవుల పెరుగుదలకు కారణ మవుతాయి. ఇవి మానవుని ఆరోగ్యానికి తీవ్ర అడ్డంకులుగా ఉంటాయి. పట్టణీకరణ, పరిశ్రమలు, ఇతర కార్యక్రమాల ద్వారా మనిషి తన అనారోగ్యానికి తానే కారణమవుతున్నాడు.

మానవుని శరీరం జీవకణ సముదాయపు యంత్రం. వాతావరణ మార్పుల మూలంగా జబ్బులు వచ్చే అవకాశం ఉంటుంది. ఏ మాత్రం అశ్రద్ధ చూపినా ఈ మార్పుల సమయంలో అనేక రకాల అంటువ్యాధులు సంక్రమించడానికి పొంచి కూర్చుంటాయి. ఈ వ్యాధులలో వైరల్, బ్యాక్టీరియల్, పారాసైటిక్ వ్యాధులు పేర్కొనదగినవి. ఈ వ్యాధులన్నీ ఒకరి నుంచి ఒకరికి వ్యాప్తి చెందేవే. అందువల్ల వీటిని కమ్యూనికబుల్ వ్యాధులు లేదా ఇన్‌ఫెక్షనల్ వ్యాధులు అంటారు. ప్రధానంగా వాతావరణం చిత్తడిగా ఉన్నప్పుడు ఈ వ్యాధులు విజృంభిస్తూ ఉంటాయి. ఇది మనకు ప్రతి సంవత్సరం కన్పిస్తున్న దృశ్యమే. ముఖ్యంగా ఈ వ్యాధులు దోమల వల్ల వ్యాప్తి చెందుతాయి. వాతావరణంలో తేమ శాతం పెరిగే కొద్దీ ఈ దోమల సంఖ్య పెరుగుతుంది. బాగా చలికాలంలోనూ, మండు వేసవి లోనూ ఇవి బతకవు. చాలా రకాల క్రిములు తేమ వల్లనే వృద్ధి చెందుతాయి. మంచినీటి కాలుష్యం వల్ల వ్యాప్తి చెందుతున్న వ్యాధుల్లో కలరా, టైఫాయిడ్, అతిసార వ్యాధి, రక్త విరేచనాలు, పచ్చ కామెర్లు వంటివి చెప్పుకో దగ్గవి.

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా అనేక వైరల్ జ్వరాలు ప్రజలుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలు దీనికి కారణం. ప్రస్తుతం వాతావరణం వైరస్‌లకు కల్చర్ మీడియంగా మారినందువల్ల అనేక రోగకారక క్రిములు వృద్ధి చెంది ఈ అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. సూక్ష్మజీవులు ఎప్పుడూ ఒకేలా ఉండవు. ముఖ్యంగా వైరస్‌లు మ్యుటేషన్‌కు గురవుతూ ఉంటాయి. ఫలితంగా వాటి జన్యు పదార్థంలో మార్పులు చేసుకుంటాయి. ప్రకృతిలో ఇప్పటి వరకూ అనేక వందల రకాల వైరస్‌లను గుర్తించారు. వాటిలో కొన్ని ఎల్లప్పుడూ మానవునికి ప్రాణాంతక వ్యాధులను కలుగజేస్తూనే ఉన్నాయి. వాటిలోనే మళ్ళీ మ్యుటేషన్స్ రావచ్చు. ఈ మ్యుటేషన్‌లను ముందుగా ఊహించడం కష్టం. అలాగే మ్యుటేషన్ చెంది ప్రజల ప్రాణాలను బలి తీసు కుంటున్నా వెంటనే గుర్తించడం కష్టం. కారణమేమంటే వైరస్ నిర్మాణం, యాంటిజెనిక్ స్వభావం తెలిసిన తర్వాతే వాటిని నిర్ధారించే పరీక్షలు రూపొందించడం సాధ్యమవుతుంది. ఇప్పుడు రాష్ట్రం అదే పరిస్థితిలో ఉంది.

పరిసరాలు ఆరోగ్యవంతంగా ఉంటేనే ప్రజలకు ఆరోగ్యాన్ని అందించగలుగుతాము. తద్వారా వ్యాధులను నివారించగలుగుతాము. ముఖ్యంగా రక్షిత మంచినీరు, పారిశుధ్యాన్ని అందించడం ద్వారా అందరికీ ఆరోగ్యాన్ని అందించగలుగుతాము. ప్రధానంగా అభివృద్ధి చెందుతున్న దేశాలలో జనసాంద్రత అధికంగా ఉన్నందున అవి ఈ రోగాల భారాలను మోయాల్సి వస్తోంది. ఆరోగ్యవంతమైన పరిసరాలు, ఆరోగ్యకరమైన జీవన విధానం ద్వారా మాత్రమే అందరికీ ఆరోగ్యం అందుతుంది. ప్రజల్లో ఆరోగ్యం పట్ల చైతన్యం పెరగాలి.

పరిసరాల పారిశుధ్యం లోపించడం, లభిస్తున్న రక్షిత మంచినీటిని కూడా పరిశుభ్రంగా ఉపయోగించకపోవడం వల్ల, తగినంతగా మరుగుదొడ్లు లేకపోవడం, తగిన గృహవసతి లేకపోవడం, సూక్ష్మక్రిములు ప్రబలడం రోగాల విజృంభణకు కారణమవుతున్నాయి. నగరాలన్నింటి లోనూ వాయు కాలుష్యం పెరిగిపోతోంది. అధిక మరణాల రేటు, శిశు మరణాల రేటు, అనారోగ్యం రేటు ప్రధానంగా పరిసరాల పారిశుధ్యం లోపించడం వల్లనే సంభవిస్తున్నాయి. పర్యావరణ పారిశుధ్యాన్ని మెరుగు పరచడం ద్వారా మాత్రమే వ్యక్తుల, సమాజాల ఆరోగ్యాన్ని కాపాడగలం. భారతదేశ జనాభాలో దాదాపు 74 శాతంమంది గ్రామాల్లో నివసిస్తున్నందున సమస్య గ్రామీణ పారిశుధ్యానికి సంబంధించిందిగా ఉంది. ఆరోగ్యానికి హానికరంగా ఉండే అంశాల న్నింటినీ తొలగించడమొక్కటే ప్రజల వ్యక్తిగత, సామాజిక ఆరోగ్యాన్ని కాపాడేందుకు మన ముందున్న ఏకైక మార్గం.

*

కథ

అనుబంధానికి వెల ఎంతో...

పులిపాక తాజుద్దీన్

"మంచినీళ్లు కావాలా సార్?" అన్నాడు బెర్తుపై పడుకుని పుస్తకం చదువుతున్న యువకుడు తనవంకే పరిశీలనగా చూస్తున్న వ్యక్తితో. తలాడించాడు రమణారావు. బాటిల్ తిరిగివ్వబోతుంటే "పర్వాలేదు సార్, మీ దగ్గరే ఉంచుకోండి. నేను తరువాతి స్టేషనులో దిగిపోతాను" అన్నాడా యువకుడు.

"నీ పేరేంటి బాబు?" అడిగాడు రమణారావు.

"కామేశ్వర రావు"

"మా నాన్నగారి పేరూ అదే" అన్నాడు రమణారావు.

"మీ ఇంటి పేరేంటి బాబు" అడిగింది రమణారావు భార్య సుశీల మాటకలుపుతూ.

"కాణిపాకం... కాణిపాకం కామేశ్వర్రావు"

రమణా సుశీలలు ఒకరి వె ఖ ప శే లో క ళ్ళ చూసుకున్నారు. అతను మాత్రం తన ధోరణిలో "నాది పాతకాలంనాటి పేరని నా స్నేహితులెగతాళిచేస్తారు. నాకు మాత్రం నా పేరంటే చాలా ఇష్టం. మా తాతగారి పేరూ ఇదే" అన్నాడు.

రమణ అతని వంక ఆశ్చర్యంగా చూసి "మీ నాన్నగారి పేరు" అని అడిగాడు.

"శ్రీనివాస రావు"

"మా నాన్న గారు మీకు తెలుసా?" ప్రశ్నించాడా అబ్బాయి.

"తెలియడమేంటి నాయనా. నేను మీ నాన్నగారికి స్వయాన తమ్ముణ్ని. వాడికో కొడుకున్నాడనే విషయమే నాకు తెలీదు. ఏదేమైనా నిన్ను చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. నువ్విప్పుడు తిరునగరిలోనే ఉంటున్నావా?"

"లేదండి. మేనమామగారింట్లో మధురైలో ఉంటున్నాను. మిమ్మల్ని...బాబాయి గారు అని పిలవచ్చా?"

"బాబాయిని 'గారూ' అని పిలవకూడదు బాబు. బాబాయి అని పిలిస్తేనే బాగుంటుంది."

కబుర్లలోనే విజయవాడ స్టేషనొచ్చింది. వాళ్లదగ్గర సెలవు తీసుకుని హడావిడిగా దిగిపోతున్న కామేశ్వర్ చేతిలో విజిటింగ్ కార్డు పెట్టాడు రమణారావు.

* * *

సుశీలా రమణలు తిరుమలస్వామి దర్శనం చేసుకుని ఇంటికి తిరిగొచ్చారు. రమణారావు ఆలోచనలు కామేశ్వర్ మీదకి మళ్లాయి. అన్నయ్య కొడుకు కనిపించడం ఆనందదాయకమా...? కాదా...? వాడూ ఈ ఆస్థికి వారసుడే. అంటే తాననుభవిస్తున్న ఈ ఆస్థిలో సగభాగం వాడిదే. అది చట్టం. కానీ ధర్మం ఏమిటి? తన అన్నయ్య ప్రేమ వివాహం చేసుకొని తండ్రికి దూరమయ్యాడు. కానీ తాను...తన తండ్రిని పున్నామ నరకం నుంచి రక్షించాడు. అందుకే ఈ యావదాస్థినీ అనుభవించే హక్కు తనదే. అదే ధర్మం. తండ్రిని కొడుకు కష్టపెట్టాడా? సుఖపెట్టాడా? అన్నది చట్టానికి ప్రధానం కాదు. అతను కొడుకా...? కాదా...? అన్నదే ముఖ్యం. కాబట్టి సగభాగం ఆస్థిని కామేశ్వర్‌కి ముట్టచెప్పక తప్పదు. రమణారావు మనసంతా ఆందోళనతో నిండిపోయింది. మంచం మీదనుంచి లేచి కూచున్నాడు.

చాలా మాట్లాడానండీ జీవితంలో... కాస్త చేతల్లోనూ చూపిద్దామని..." అన్నాడు రమణారావు. సుశీల కూడా పూజలూ వ్రతాల జోరు తగ్గించింది. పూజించడమంటే భగవంతుడి ఫోటో చుట్టూ హారతి పళ్లెం తిప్పడం కాదనీ... అందర్నీ మెప్పించే విధంగా ప్రవర్తించడమేననీ తెలుసుకుంది.

ఇంతలో సుశీల నీళ్ల మరచెంబు పట్టుకుని గదిలోకొచ్చింది.

రాబోయే విపత్తును వివరంగా చెప్పాడు.

"ఈ ఆస్థినంతా అమ్మాయీ అల్లుడు అనుభవిస్తారనుకుని ముచ్చటపడ్డాం. కానీ మన తలరాతిలా తగలడిందా" అంది నిరాశగా సుశీల.

"ప్రస్తుతానికి ప్రమాదమేమీ లేదంటాను" అన్నాడు వకీలుగారు అంతావిని.

"కానీ భవిష్యత్తులో రాదంటారా?" అన్నాడు రమణారావు. "మీ అన్నయ్యగారు ఆ కుర్రాడి తల్లిని రిజిష్టరు మారేజీ చేసుకున్నారా?"

"లేదండీ గుళ్లో నిరాడంబరంగా చేసుకున్నారు."

"అయితే డోంట్ వర్రీ మాస్టారు... గుళ్లో దండలు మార్చుకుంటే...సమాజం దృష్టిలో పెళ్లయినట్టే...కానీ చట్టపరంగా అది పెళ్లే కాదు. సాంప్రదాయబద్ధంగా జరిగినదే చట్టం దృష్టిలో పెళ్లి. అసలాకుర్రాడు మీ అన్నయ్య కొడుకే కాదనీ, మీ అన్నగారి ఉంపుడుగత్తె కుమారుడనీ, అతని తల్లితో మీ అన్నగారికస్సలు వివాహమే జరగలేదనీ వాదిద్దాం. మిమ్మల్ని గెలిపించే బాధ్యత నాది" అన్నాడు ఫీజు పుచ్చుకుంటూ లాయరు.

* * *

రెండు నెలలతర్వాత...

రిజిష్టరు కవరులో ఓ ఉత్తరం, డ్రాఫ్టూ వచ్చాయి. కవరు తెరచి, ఉత్తరం తీశాడు రమణారావు.

ప్రియమైన బాబాయికి,

నమస్కారాలు. మిమ్మల్ని చూసిన రోజునుంచీ మనసంతా మీ తలపులతోనే నిండిపోయింది. న్యూయార్క్‌లో నాకో పెద్ద ఉద్యోగం దొరికింది. మన లెక్కల ప్రకారం నెలకి రెండు లక్షల రూపాయల జీతం. మామయ్య బలవంతం మీదే వెళుతున్నాను. మరో ఐదేళ్లదాకా రావడం కుదరదు. చెల్లాయిని చూడలేకపోతున్నందుకు బాధగా ఉంది. డబ్బుకోసం ప్రేమాభిమానాలను, బాంధవ్యాలనూ వదిలేసే స్వార్థపరుణ్నని మాత్రం అనుకోకండి. పిన్నిని మరీమరీ అడిగినట్టు చెప్పండి. చెల్లాయి పెళ్లికోసం మీ పేర లక్ష రూపాయలు డ్రాఫ్టు పంపుతున్నాను. మీ ఆరోగ్యం జాగ్రత్త. చెల్లాయికి ఆశీస్సులు.

మీ కామేశ్వర్ .గదంతా గిర్రున తిరుగుతున్నట్లు అనిపించింది. అతి కష్టం మీద తడబడుతూ వెళ్లి సోఫాలో కూర్చున్నాడు.

"ఏమయిందండీ" అంది ఆత్రుతగా సుశీల.

రమణ యాంత్రికంగా చేతిలో ఉన్న ఉత్తరం ఆమెకందించాడు. అది చదవగానే నిశ్చేష్టురాలై నిలబడిపోయిందామె.

ఆదివారం ఉదయం...నలుగురు పెద్దమనుషులు లోనికొచ్చి రమణారావుకు నమస్కరించారు.

"వచ్చే ఆదివారం రామకృష్ణులవారి జన్మదినం. చాలాకార్యక్రమాలు పెట్టాం. మీ ఉపన్యాసం ఉంటే బాగుంటుందని అంటున్నారు" అన్నారు.

"క్షమించాలి నేను ఉపన్యసించను. కార్యక్రమానికి తప్పకుండా వస్తాను"

"స్వార్థాహంకారాలనెలా జయించాలో మీ అంత గొప్పగా చెప్పేవారెవరున్నారీ ఊళ్లో?" అన్నాడు మరొకాయన.

"థాంక్స్ ఫర్ ది కాంప్లిమెంట్! కానీ చాలా మాట్లాడానండీ జీవితంలో... కాస్త చేతల్లోనూ చూపిద్దామని..." అన్నాడు రమణారావు.

సుశీల కూడా పూజలూ వ్రతాల జోరు తగ్గించింది. పూజించడమంటే భగవంతుడి ఫోటో చుట్టూ హారతి పళ్లెం తిప్పడం కాదనీ... అందర్నీ మెప్పించే విధంగా ప్రవర్తించడమేననీ తెలుసుకుంది.

*

పప్పెట్ ఇంటర్వ్యూ



శాంతి శ్రీ

వైయస్‌తో కాసేపు...

(**సార్** ఒక్కనిముషం... అంటూ విలేకరులంతా ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డిని చుట్టుముట్టారు. ఏంటయ్యా ఒక్కనిముషం ఇప్పుడు వీలుకాదు. మీకేమీ పనిలేకపోతే నాకులేదా? ఇప్పుడు ఇంటర్వ్యూలేం కుదరవ్‌పొండి అంటూ విసుక్కున్నాడు. అయినా రిపోర్టర్ నందీశ్వర్ మాత్రం వదలల్లేదు. సార్! టిఆర్‌యస్ వాళ్లు పోవడం మీకు సంతోషంగానే ఉందా అంటూ వెంటపడ్డాడు. అవునయ్యా సంతోషమే అయితే ఏంటంట? నీకేమన్నా బాధగా ఉందా? అయినా మాకు లేని బాధ మీడియా వాళ్లకెందుకయ్యా వదిలిపెట్టకుండా వెంటపడుతున్నారు. మీ కేం పనీపాటా లేదా. ఉన్నవీ లేనివీ కల్పించి రాసి పేపర్లు అమ్ముకుందామను కుంటున్నారా? అదేం కుదరదు హా....హా.... అంటూ ఒక పెద్ద నవ్వు నవ్వేసి కారెక్కేసి అటేపోతా. అయినా నందీశ్వర్ వదల్లేదు. పట్టువదలని విక్రమార్కుడిలా ఆయన వెంటే మోటార్‌సైకిలెక్కి సెక్రటేరియట్‌కు చేరుకున్నాడు. ఆయ్ ఆగు అంటూ సెక్యూరిటీ ఆపేసింది. నేను టెర్రరిస్టును కాదుసార్. రిపోర్టర్‌ను. సీయంగారి ఇంటర్వ్యూ కావాలి అంటూ లోపలికి వెళ్లబోయాడు. ఆగు నీపేరేంటి...? నీదే పేపరు...? ఇలా ప్రశ్నల వర్షం కురివించారు. నంది...పూర్తిచేయబోతుండగానే నందా?...పందా? అంటూ అందులో ఒక సెక్యూరిటీ గార్డు ఇకిలించాడు. ఇక వదిలేట్టు లేడనుకున్న సెక్యూరిటీ తన పై ఆఫీసరును అడిగి అక్కడే పక్కగదిలో కూర్చోబెట్టి లోపలకు కబురు పంపాడు. వైయస్ ఈ తలనొప్పి తప్పదనుకున్నాడో ఏమో "ఏం కేసురా నాయనా పొద్దున్నే భలేదొరికిందే..." అంటూ సరే పంపండయ్యా అనడంతో పొంగిపోయిన నందీశ్వర్ పెన్ను,నోట్ బుక్కు చేతిలో పట్టుకొని కదనరంగానికి పోతున్న సైనికునిలా అటెన్షన్ ఫోజులో సియం ఛాంబర్‌లోకి అడుగుపెట్టాడు. రావయ్యా బాబూ నాకు అసలే టైం లేదు అంటూ వాచ్‌ను అటూఇటూ చూసుకుంటూ, కాసేపు పై కప్పువంక చూస్తూ చిరునవ్వుతో స్వాగతించారు. వారిద్దరి మధ్య ఇంటర్వ్యూ ఇలాసాగింది. ఇక చదవండి.....సం.)

వైయస్: రావయ్యా నందీశ్వర్. నీలాగా పట్టుదల గలవాళ్లంటే నాకు చాల ఇష్టం. నీకు తెలుసా? నేనెంత పట్టుదలగా పాదయాత్ర సాగించానో.....

నందీశ్వర్: (ఈయన పొగడ్తలకు పడిపోతాడో లేదో అని అనుమానిస్తూనే) అందుకేగా సార్ మీరు మీడియాకు ఆరాధ్యదైవంగా మారారు.

వైయస్: నాదేముందయ్యా. అంతా జనం దయ.

నంది: జనందేముంది సార్ అంతా గొర్రెలమంద. ఎవరెటులాగితే అటుపోతారు

వైయస్: అవునవును భలేచెప్పావయ్యా. నువ్వు నాకు నచ్చావ్. అందుకేగా ఎలక్షన్ ముందు చెప్పిన మాటలన్నీ మార్చేసి చెప్పినా నమ్మేస్తున్నారు. అదే నాధైర్యం. నేననుకున్నది ఎట్లాగైనా సాధించి తీరుతా.

నంది: ఏమిటి సార్ మీరనుకున్నది?

వైయస్: ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలి. ప్రాజెక్టులు కట్టాలి. నాపేరు చిరస్థాయిగా ఉండాలి.

నంది: ప్రాజెక్టుల్లో అవినీతి ఎక్కువగా ఉందని విమర్శలు వస్తున్నాయి. దానిపై మీ కామెంట్ ప్లీజ్?

వైయస్: లోకులు కాకులు. నలుగురు నాలుగురకాలుగా అనుకుంటారు. వాటిని పట్టించుకోకూడదు. అయినా ఈ రోజుల్లో డబ్బులు తినందెవరయ్యా. నీ వేమన్నా పత్తిత్తువా? నంది: సార్.....

వైయస్: సరేలేవయ్యా ఏమనుకోమాకు. నీ గురించి కాదు. నాకు ముందున్న చంద్రబాబు గురించి అన్నాలే. వాళ్లున్నంత కాలం రాష్ట్రాన్ని దోచుకుతిన్నారు. మాకేమన్నా మిగిల్చారా తింటానికి? అందుకేగా బొచ్చె చేతపట్టుకొని ప్రపంచబ్యాంకు దగ్గరకు పరుగుతీశాను.

నంది: అప్పు తెచ్చి బొక్కేస్తున్నారని తెదే విమర్శిస్తున్నది.

వైయస్: వారేగదా మా గురువులు. అయినా పనికి ఆహారం పథకంతో పోలిస్తే ఇదెంత?!

నంది: ప్రపంచబ్యాంకుకు వడ్డీలు కట్టడానికే పన్నులు,చార్జీలు పెంచుతున్నారని వామపక్షాలు విమర్శిస్తున్నాయి.

వైయస్: వాళ్లకేం పనుంది చెప్పు. ఉనికి కోసం సవాలక్షమాటలంటారు. అయినా ఇవన్నీ నాకు తెలియదు. రోశయ్యనడగండి అన్నీ వివరంగా చెపుతాడు.

నంది: మీరు ప్రతిపక్షనేతగా ఉండగా చంద్రబాబును ప్రపంచబ్యాంకు జీతగాడని తిట్టారుగా సార్.

వైయస్: మీ పేపర్లోళ్లకి బొత్తిగా బుర్రుండదు. ఒత్తిత్తినే అన్నోటినన్నీ పట్టుకొని సీరియస్‌గా అడిగేస్తే ఎలా చెప్పు. ఏది పడితే అది అడ్డంగా రాసిపడేస్తారు. చేతిలో పెన్నుందికదాని ఇష్టం వచ్చినట్లు రాస్తే ఊరుకునేది లేదు. తెలిసిందా?

నంది: (తల అటూఇటూ తిప్పాడు పాపం చేసేదేమీ లేక)

వైయస్: ఇక అడుగు(అంటూనే మాటిమాటికి చేతి గడియారం వంక చూసుకుంటున్నాడు. ఈ జిడ్డుగాడు ఎప్పుడొల్తాడా అన్నట్లుగా)

నంది: ఆర్టీసీ సమ్మెను ఎలా పరిష్కరిస్తారు?

వైయస్: నా చేతిలో ఏముంది? అంతా సబ్‌కమిటీయే చూసుకుంటుంది. అయినా సమ్మెచేస్తే నష్టపోయేది వాళ్లేగదయ్యా. అందుకే మేం చెప్పినట్లు వింటే బాగుపడతారు(అంటూ పెద్దగా నవ్వాడు)

నంది: (అన్నిటికీ ఇలా నవ్వుతాడేంటి అనుకుంటూ) అదెలా సార్ (వినయంగా అడిగాడు)

వైయస్: ఏముందయ్యా. వాళ్లు సమ్మె చేయాలనేగదా మేం వారి డిమాండ్లు అంగీకరించంది. బస్సులాగిపోతే ప్రైవేటుబస్సులు పెట్టి నడిపిస్తాం. వాళ్లన్నా బాగు పడతారు. సమ్మె రోజుల్లో నష్టాలొస్తే దాన్ని కూడా కలిపి మూసేయడానికి సిద్ధపడతాం అంతే... వెరీ సింపుల్.

నంది: అబ్బా...అబ్బా...ఏం తెలివి సార్. మిమ్మల్ని అమెరికా అధ్యక్షుణ్ని చేస్తే బాగుంటుంది సార్. (మరోసారి బుట్టలో వేయాలనుకున్నాడు) ఒకవేళ సమ్మె చేయకుంటే?

వైయస్: మరీ మంచిది. మేం ఏమీ చేయకుండానే దానంతటదే మూతపడుతుంది. అదేకదయ్యా మాక్కావలసింది. ఆ యూనియన్లు చెప్పినట్లు చేశామనుకో. ఇక ఆర్టీసీ మూతపడే సమస్యే లేదు. ఆ దరిద్ర్యాన్ని వదిలించుకోకుండా మాకెవడప్పిస్తాడయ్యా.

నంది: ఆర్టీసీ అంటే ఎందుకంత కోపం సార్ మీకు?

వైయస్: నాకేం కోపమయ్యా బాబు. నీకు బొత్తిగా లోకజ్ఞానం ఉన్నట్లు లేదే. నీకు అసలు విషయం తెలిసినట్లు లేదు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేయలేదనుకో ప్రపంచబాంకోళ్లు అప్పులివ్వరు. వాళ్లు అప్పివ్వకపోతే మా కథ నడవదు. మళ్లా వచ్చే ఎలక్షన్లో డబ్బులెట్లా. వాటిని ఇప్పటి నుండే పోగేసుకోవాలా వద్దా. నేనేమన్నా నా సొంతానికి వెనుకేసుకుంటున్నానా ఏమి చంద్రబాబులాగా. నేను నిస్వార్థపరుణ్ని. కాకుంటే మా గుంపును పోషించాలంటే డబ్బు కావాలా వద్దా చెప్పు?

నంది: మరి రైతులకు ఉచిత విద్యుత్ కొనసాగిస్తారా లేదా?

వైయస్: తప్పకుండా కొనసాగిస్తా. అది నా పెంపుడు బిడ్డ. దాన్ని వదులుకుంటానా చెప్పు. కాకుంటే తీగలుంటాయి. కరెంటువస్తుందో లేదో చెప్పలేను. ఆ తర్వాత మోటార్లుంటాయ్. తీగలు కూడా కట్టవుతాయి. అంతే....

నంది:(నోరెల్లబెట్టాడు)....అవును సార్. ఇలా నెలలు కూడా తిరక్కముందే మాటలెలా మారుస్తారు మీ రాజకీయనాయకులు.

వైయస్: మా జాతిలక్షణమే అంత. ఇప్పటికైనా అర్థమైందా రాజకీయనాయకుల పవరంటే ఏమిటో. ఇంకెప్పుడూ నా వెంట పడకు. కావాలంటే నువ్వొచ్చి మా పార్టీలో చేరిచూడు నీకే అర్థమవుతుంది రాజకీయ మంటే ఏమిటో.

నంది: అయితే ఎప్పుడు రమ్మంటారు సార్. వచ్చి చేరిపోతా. ఈ జర్నలిస్టు పనికన్నా అదే సుఖంగా ఉంటుంది(ఒక్కడు సినిమాలో అర్జున్ ఛాలెంజ్‌లాగా అనేశాడు వచ్చిన ఛాన్సు మళ్లీ మిస్సయిపోతుందనే బెంగతో)

వైయస్: కొంప ముంచేట్టున్నావ్ గదయ్యా. నిన్ను చూస్తుంటే గుండెలు తీసిన బంటులాగున్నావే. నేనేదో మాటవరసకంటే వచ్చి చేరిపోవటమే. ఇప్పటికే ఉన్నోళ్లతో చస్తున్నాం. వాళ్లకే పదవుల్లేక మంత్రివర్గ విస్తరణనే వాయిదా వేస్తూ ఊరిస్తూ వస్తున్నా. ఇక నీకెక్కడ పదవి తెచ్చిచ్చేది. అయినా పదవులేమన్నా తేరగా వస్తాయను కుంటున్నావా. దానికెంత కష్టపడాలి. వాలాగా కనీసం పాదయాత్రన్నా చేయాలి. లేదా కోట్లన్నా ఖర్చు పెట్టాలి. నువ్వు సిద్ధమేనా? చెప్పు. ఈ క్షణంలో రెడీ.

నంది:(అంతే తుపాకి గుండుకి కూడా అందకుండా పరిగెత్తేశాడు) *

తెంగ్లీష్

డా॥ జె.పి. వైద్య

"మై డియర్ కంట్రీ...!'

రంగురంగుల తోరణాలూ...!
డ్రమ్ముల్లో మట్టినింపి... అందులో వెదురు బొంగుల్ని నిలబెట్టి,
అడ్డంగా కట్టిన గుడ్డల బ్యానర్లూ...!
అంతగా పేరులేని ఓ చిన్న 'పల్లెటూరు'...!
నేల ఈనినట్టు ఊరినిండా జనం...!
వాళ్ళను కప్పేస్తున్న దుమ్ముల మేఘాలూ...!
చూస్తూ చూస్తూ 'రంమ్ః' ...'రంమ్' అంటూ సైరన్లమోత...!
వరుసగా వేగంగా దూసుకొస్తున్న కార్లూ...!
మళ్ళీ లేచిన దుమ్ము మేఘాలూ...!
ఏమైంది అప్పన్నా...?" ఎవరో ఆరాటపడ్తూ ప్రశ్నించారు...
'అరే! మినిస్టర్ సాబ్ వచ్చిండు... మనూరికి...!'
చిరిగిన గుడ్డల్లో... మొహాల్లో ఆశల చిరునవ్వులు చిందిస్తూ, ఊరోళ్ళంతా గుమిగూడారు...
లారీల్లో వచ్చిన 'పక్క ఊరివాళ్ళు'... వాళ్ళను త్రోసుకుంటూ ముందరికెళ్ళి చీటికీ మాటికీ చప్పట్లు కొట్టసాగారు...
బ్రహ్మదేవుడు కళ్ళు మూసి తయారుచేసినట్టున్న 'మినిస్టరీ గారు' అతికష్టంగా లేచి నిలబడ్డారు...
పెద్ద బానలాంటి పొట్ట...! ఎంత కుదురుగా కుట్టినా అతకని, పొతకని ఖద్దరు కుర్తా...!... గతిలేక దూరంగా తలొంచి నిలబడ్డ మైకు...!
పూలహారాల్లో ఒదిగిన 'మినిస్టర్ సాబ్' మొహం సరిగ్గా కన్పించడంలేదు...
టోపి కింద ఉన్నదే 'మొహం' అనుకోవాలి...!
పూటకు సరిపడా 'గంజి' కూడా దొరకని పల్లెటూరి ప్రజలకు మినిస్టర్ గారు సందేశం ఇవ్వడం ప్రారంభించారు...
"డియర్ విలేజ్ ఓల్డ్‌మెన్ అండ్ ఓల్డ్‌వుమెన్,
జెంటిల్‌మెన్ అండ్ జెంటిల్ లేడీస్,
స్మాల్ చిల్డ్రెన్ అండ్ వెరీస్మాల్ చిల్డ్రెన్..."

స్టేజిమీద 'మినిస్టర్ గారి' వెనక నిలబడ్డ 'అణా-కానీ' లీడర్ గాలిలో చెయ్యెత్తి చప్పట్లు' కొట్టి - 'భజన' ఎలా చెయ్యాల్లో ప్రాక్టికల్స్ చూయించారు...
గోచీక్కూడా దిక్కులేని 'పోరగాళ్ళ'కు ఎక్కడలేని ఉత్సాహం ముంచుకొచ్చింది...
అరిచేతులు నొప్పిపెట్టేంత చప్పుడు చేస్తూ, చప్పట్లు కొట్టసాగారు...
'మినిస్టర్‌గారు'... నాలుగు ఉంగరాలున్న చేతిని ఎత్తి 'ఇక చాలు' అన్నట్టు సూచించారు...
ఇంకా... ఉంగరాలు నిండి ఉన్న చేయితో మెడను రుద్దుకోసాగారు...
'పూలహారాల భారం'... అనుకున్నారు ప్రజలు...
ఇరవై ఏళ్ళుగా తగ్గని 'చర్మవ్యాధి' అన్నది తెలియని అమాయకులు...!
"పూజ్య గాంధీజీ డెలివర్డ్ స్వాతంత్ర్యం...! ఫిఫ్టీ ఇయర్స్ కన్న 'మోర్' అయింది! గాన్ గవర్మెంట్ ఏం చేసింది అని అడ్గుతున్న...! అయినా, వై క్రిటిసైజ్? పూజ్యగాంధీజీ చెప్పింద్రు...! ఏం చెప్పింద్రు...? 'పీసూ'...! మూడు కోతులు ఎర్కేనా?... నో బ్యాడ్ లుకింగ్...! నో బ్యాడ్ హియరింగ్...! నో బ్యాడ్ టాకింగ్...! అంతటా 'బ్యాడ్' చేసి పొయింద్రు...! మేం 'గుడ్' చేస్తమని మీకు తెలియజేస్కుంటున్నా...! నా రక్తంల లాస్ట్‌డ్రాప్' దాంకా మీకు సర్వీసింగ్ చేస్తా అని ప్రామిస్ చేస్తున్న...!"
స్టేజిమీద 'పిల్లలీడర్లు' చేతులు లేపి చప్పట్లు కొట్టసాగారు...
"మన ఊర్లె నల్లలు పెట్టిస్తా అంటున్నడు మినిస్టర్ సాబ్" అని పటేల్‌సాబ్ పక్కోడి చెవుల్లో ఊదారు... ఆ 'వార్త' జనంలో పాకింది చప్పట్లే చప్పట్లు...!

"కంట్రీ ఫేసింగ్ ప్రాబ్లమ్స్...! మీరు చిన్నప్పుడే చదువ్కొని ఉంటరు... వాటర్ వాటర్ ఎవ్రీహ్వేర్... నో మోర్ టు డ్రింక్...! గట్లనే దేవంల ప్రాబ్లమ్ ప్రాబ్లమ్ ఎవ్రీ హ్వేర్... సాల్వ్ సాల్వ్ హూ?... పరిస్థితి లావే డిఫికల్ట్ ఉన్నది...! ఫిస్కల్ డెఫిసిటీ గూడ ఉన్నది"...
ఫిస్కల్ డెఫిసిటీ ఏమిటో అర్థంగాక మినిస్టరుగారు చిరునవ్వు నవ్వి టాపిక్ మార్చింరు...!
ఆ ఐదుసెకండ్లలో సర్‌పంచ్ జోర్త బర్రిండు...
'మినిస్టర్ సాబ్ జిందాబాద్...!'
ప్రజలు మళ్ళీ చేతులు నొప్పిపెట్టేదాక చప్పట్లు కొట్టడం ప్రారంభించారు...
ఆ 'చప్పుళ్ళు' మధ్య సర్పంచ్ మెల్లగా వార్త ఊదేసాడు...
"మినిస్టర్ సాబ్ ప్రతి ఇంటికి పుక్యంల 'బల్బ్' పెట్టిస్తా అన్నడని..."
"బల్బ్ ఇస్తడు... గని, అది వెల్గుతదా! లేదా! అన్న అనుమానం వచ్చినా. ప్రజలు చేతులు నొప్పి పెట్టేదాకా 'చప్పట్లు' కొట్టేసారు...
'మినిస్టర్‌సాబ్' సాధ్యమైనన్ని వాగ్దానాలు కక్కేసి అలిసిపోయి వేదిక దిగారు...
"వాగు మీద సంవత్సరం లోపల క్యామ్, ఊళ్ళో సిమెంట్ రోడ్డు, రోడ్ పక్కన ఫ్యాక్టరీ, ఫ్యాక్టరీ పక్కన పేదవారికి ఇండ్లు, ఇండ్లల్లో ఉచితంగా వెలిగే బల్బులూ, ధారాళంగా పారే నల్లా నీళ్ళూ, ఎంత వరదలొచ్చినా ఊళ్ళో నీళ్ళు రాని ఏర్పాట్లూ, పిల్లలకు బళ్ళూ, బళ్ళల్లో టీచర్లు, వాళ్ళు రాకపోతే సస్పెండ్ చేసిపడేస్తా అన్న బెదిరింపులూ..."
ప్రజలు చప్పట్లు కొట్టీ కొట్టీ అలసిపోయారు...
మినిస్టర్‌గారు 'వాగ్దానాలు' ఇచ్చీ ఇచ్చీ అలసిపోయారు...
'అలసట' పోగొట్టడానికి 'గెస్ట్-హవుజ్'లో ఏర్పాట్లు జరిగాయి...!
తెలుగు, ఇంగ్లీషు, హిందీలో రిపోర్టర్లు ప్రశ్నల జడివాన కురిపించారు...
సందర్భం, ఔచిత్యం, విలువలూ పాటించని మినిస్టర్‌గారు సరదాగా 'ఆఁ ఏమున్నది?... అంతా దున్నపోతు మీద వాన తీరు...' అన్నారు...
అది ఎవరినుద్దేశించి అన్నారో అర్థంకాక 'రిపోర్టర్లు' తికమక పడిపోయారు.
'మన సమాజంల 'టెల్గు'కు 'వ్యాల్యూ' ఇస్తలేరు... దేశ భాషలల్ల తెలుగే లెస్...' అని ఉత్సాహం పొంగిపొరలిన మినిస్టర్‌గారు 'టెల్గు అందాలు తెల్వాలని నేను ఇంగ్లీషుల తర్జుమా చేసింది విన్పిస్త అని డైరీ తీసి కవిత్వం విన్పించారు...

"పీజన్స్ ఫెదర్స్ వియరింగ్...
రో సిటింగ్ వల్చర్స్...
సిగ్నేచర్స్ పుట్టింగ్ రూలర్స్
ఫింగర్స్..." అని ఆగి చుట్టూరా చూసి నవ్వబోయారు...

హాల్లో ఎవ్వరూ లేరు...! ఎప్పుడు, ఎలా జారుకోవాలో ప్రజలకూ తెలిసిపోయింది...

"పావురాళ్ళ ఈకలు తొడుక్కొని
పంక్తిలో కూర్చున్న రాబందులు
సంతకాలు పెట్టే పాలకుల వేళ్ళ
సందుల్లోని విషమ సంధులు" అన్న కవితను కాపీ కొట్టిన మినిస్టరు గారు... హూఁ...! కంట్రీ నీడ్స్ మి' అని కారువైపు కదిలారు.

ఓ ఊరి కథ

హేమలత

గొర్రెకుంట

ఏ దేవాలయానికైనా పూజారులంటే ఎవరై ఉంటారో చెప్పుకోండి చూద్దాం?. ఆ.. ఇదీ ఒక ప్రశ్ననా, ఎవరో ఏంటి కచ్చితంగా బ్రాహ్మణులే. ఇదే మీ సమాధానం కదూ. కానీ ఇక్కడి శైవ క్షేత్రంలో గొల్లవారే పూజారులు. ఇక్కడ ఎక్కడో సూటిగా చెప్పొచ్చుగా అని గుర్రుగా చూస్తున్నారా? అదే చెప్తున్నా. ఈ శైవ క్షేత్రం ఎక్కడుందంటే వరంగల్ జిల్లా గొర్రెకుంట గ్రామంలో. ఇదెక్కడో? మీకు రైల్వే స్టేషన్ తెలుసా? ఏ రైల్వేస్టేషనా? ఇంకేది వరంగల్ రైల్వేస్టేషన్. అక్కడి నుంచి సరిగ్గా ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉంది గ్రామం. ఈ శైవ క్షేత్రానికి 1000 సంవత్సరాల చరిత్ర ఉందండోయ్. ఇది పూర్వీకుల నుంచి వస్తున్న సాంప్రదాయమట. అదే వారసత్వంగా ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ సందర్భంగా మీకొక్కటి గుర్తురావాలే. ఏంటో చెప్పమంటారా? అదే సర్వమానవ సమానత్వం. ఈ విషయం విన్నవారందరూ ఖచ్చితంగా ఈ మాటనుకుంటారు మరి. ఈ క్షేత్రం వివరాలింకా తెలుసుకోవాలనుందా? అందులోకే వస్తున్నా. మల్లికార్జునుడిక్కడ 'మల్లన్న' గా పుట్టి 'గొల్ల కేతమ్మ' ను పెళ్లిచేసుకున్నాడట. తదనంతరం శత్రువుల పాలైన తన నగరాన్ని గెలుచుకుని పరిపాలించాడట. ఈ 'మల్లన్న' నే ఇక్కడ 'మైలారు దేవుడు' గా ప్రజలు కొలుస్తున్నారు. అది సరే, ఇక్కడ జాతరల్లాంటివేం ఉండవా అన్న సందేహం మీకీపాటికే వచ్చుండులే. ఇక్కడ జాతర కొన్ని రోజులు కాదు కొన్ని నెలలే ఉంటుంది. రంగుల రాట్నాలు, గారడీలు మొదలగు వాటితో యమా హుషారుగా సాగుతుంది. ప్రస్తుతమీ గ్రామం బాగా అభివృద్ధి చెందిందండోయ్. ఇక్కడో పెద్ద పారిశ్రామిక వాడ అభివృద్ధికి చిహ్నంగా మీకు దర్శనమిస్తుంది. ఈ గ్రామం నుంచి మూడు పర్లాంగుల దూరంలో 'ఆనందాశ్రయ్' వస్తుంది. ఇదేదో వృద్ధాశ్రమం అయ్యుంటుంది అనుకుంటున్నారా? ఇంకా సందేహమెందుకు ఇది వృద్ధాశ్రమమే. ప్రొ. పర్మాజీ, ప్రతాపగిరి రాజయ్య తదితరులు పదెకరాల స్థలంలో దీన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడే ఉన్న ప్రసిద్ధిగాంచిన మరో గ్రామం ధర్మసాగర్. కాజీపేటకు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉంది.

ఈ గ్రామంలో ఒక నీటి చెరువుంది. చెరువంటే చిన్నదేమో అనుకునేరు. అప్పట్లో నిజాం ప్రభుత్వం వరంగల్ ప్రజలకు దీనినుంచే నీటిని పుష్కలంగా సరఫరా చేసిందట! ఇదెంత పెద్దచెరువో అర్థమయ్యే ఉంటుంది. అలాంటి చెరువుండటం వల్లే ఈ గ్రామానికంత పేరొచ్చింది మరి.

అప్పటి పైపులే నేటికీ వాడుకలో ఉన్నాయంటే ఆశ్చర్యంగా ఉంది కదూ! అప్పట్లో ఈ చెరువును వరంగల్ ప్రజలు తరచూ దర్శిస్తూ ఉండేవారట. అంటే పిక్నిక్‌లా అన్నమాట!

*

మానేసా

ఈ మధ్య సిగరేట్, ఆల్కహాల్, వక్కపొడి, పేకాల మానేసాను?
అవునా మరి కొత్త అలవాటు ఏం నేర్చుకున్నావ్?

అబద్దాలాడటం...

టర్నింగ్ పాయింట్

వంద ఏ మాత్రం... వందేమాతరం

ఉదయ శంకర్

మన దేశాన్ని బ్రిటీష్ దొరలు తమ గుప్పెట్లో పెట్టుకున్న రోజులవి. అక్కడక్కడ చిన్నచిన్న రాజ్యాలకు చెందిన పాలకులు ప్రజల చొరవతో అనేక తిరుగుబాట్లు చేశారు. ముఖ్యంగా అనేక గిరిజన తెగలు తమ అడవిని, దానితో ముడిపడి ఉన్న తమ బతుకుల గురించి తెల్లదొరలతో పోట్లాడారు. ఇలాంటివి ఎన్నో జరిగాయి. కాంగ్రెస్ అనే పార్టీ ఏర్పడ్డం, ఆ రోజుల్లో కేవలం విజ్ఞాపన పత్రాలు సమర్పించడమూ చేసేవారు.

రాజభక్తిని ప్రదర్శిస్తూ కాంగ్రెస్ పంపిన విజ్ఞాపనల మూలంగా 1892లో ఒక చట్టంద్వారా భారతీయులకు శాసన సభలలో స్వల్ప ప్రాతినిధ్యం లభించడంతప్ప పరిపాలన విధానంలో చెప్పదగ్గ మార్పులు ఏవీ రాలేదు.

దేశమంతా అట్టుడికిపోతున్న సమయంలో బెంగాల్‌లో ఓ గొప్ప సంఘటన జరిగింది. బెంగాలీ ప్రజలందరి అభిప్రాయానికి భిన్నంగా వైస్రాయి కర్జన్ అనే బ్రిటీష్ అధికారి ముస్లింలను హిందువుల నుంచి వేరుచేసి జాతీయోద్యమాన్ని అణిచివేయాలని చూశాడు. బెంగాల్‌ను రెండుగా విభజించాడు. ఒకే భాష మాట్లాడేవాళ్ళను వాళ్ళ వాళ్ళ మతాలపేరిట రెండుగా చీల్చివేయడాన్ని బెంగాలీలు సహించలేకపోయారు. మతాలు వేరైనా ఎంతో కలివిడిగా, తమతమ అభిరుచులు అభిప్రాయాలు, వేషభాషలొక్కటిగా కలిసిపోయి బతుకుతున్నారు. ఆ ఐక్యమత్యంతోనే తమపై సాగుతున్న తెల్లవాళ్ళ దోపిడీ దౌర్జన్యాలను నిరసించారు. ఆ నిరసనాగ్రహావేశాలకు అదే ఐక్యమత్యం ఉంటే ఇంకేమన్నా ఉందా?! బ్రిటీషోడికి తన బెడ్డా బ్యాగ్గా సర్దుకుపోవాల్సిందే కదా అని బెదురుపుట్టింది. అందుకే ఆ మహానుభావులు ఈ చిచ్చు పెట్టింది.



ఒక్కోచోట ఒక్కోరకం చిచ్చు దేశమంతటా పెట్టారు. బెంగాల్‌లో తెల్లదొరతనానికి ఎదురయిన ఈ సమస్యతో ప్రజల్ని చీల్చే కుతంత్రానికి ఇలా దిగారు.

అప్పటికే అరవిందఘోష్, బిపిన్‌చంద్రపాల్ లాంటివారు ఇచ్చిన పిలుపు, "స్వరాజ్యం నా జన్మహక్కు" అనే నినాదంగా పొలికేక అయ్యింది. బాలగంగాధర తిలక్ దాన్ని ఇంకా ముందుకు తీసుకుపోయారు. అయినా ప్రజలందరినీ పెను ఉప్పెనలా నడిపించే తారకమంత్రం దొరకలేదు. విదేశీ వస్తువుల్ని-దుస్తుల్ని తగలబెట్టించిన, స్వదేశీ వస్తువులు-ఖాదీ బట్టలు తొడగడం మొదలు పెట్టించిన ఒక మహత్తర మంత్రం పుట్టింది ఈరోజుల్లోనే. అదే "వందే మాతరం". భారతదేశం దేశమంతా ఏ భాషవారైనా సరే... "వందే మాతరం అంటాను", "అమె భోలూచీ బందే మాతరమ్", "ము కహూంచీ వొందే మోతొరమ్", "వణ్దే మాదరందా నాను సొల్లుంగే", "మై వందే మాతరమ్ బోలూంగా" అంటూ అందరినోట నానింది. ఈ వందే మాతరం అనే మాట ఓ నినాదమై... నిప్పులు కురిసే అగ్నిభాండమై...జాతీయోద్యమ చరిత్రనే ఒక్క కుదుపు కుదిపింది. ఒకానొక పెనుమలుపు తిప్పింది. స్వాతంత్రసమరాన ఒకటో దశను దాటి రెండో దశకు తెర లేపింది.

ఆంధ్రప్రాంతాన బకించంద్ర గీతం వందేమాతరం జనులందరి సంగీతమైంది. కౌతా శ్రీరామశాస్త్రిగారు ఆవేశపూరితులై ఆ గీతాన్ని అందుకుంటే చాలు ఆనాటి సభ కిక్కిరిసిపోయేది. సభికులందరి ఒంట్లో నెత్తుర్లో జరజరా విద్యుత్ ప్రసరించేది. ఇద్దరు కలిసినప్పుడు నమస్కారమండీ అనే సంబోధన బదులు "వందే మాతరం" అనేది చోటుచేసుకుంది. ఏం చెయ్యాలో పాలుపోని బ్రిటీష్ పాలకుల చెవులకు ఆ వందేమాతర శబ్ధం సీసపు చుక్కల్లా తయారయ్యాయి. ఆ మాటన్నవాడినల్లా విరగ్గొట్టి జైల్లోకి తోసేస్తున్నారు. అయినాసరే రోజుకి కొన్నిసార్లన్నా వందేమాతరం అనకుండా ఉండలేక పోయారు. ఒకసారలా నినాదం పలుకుతుండగా పోలీసులొచ్చి ఆయన్ను పట్టుకోవడానికి పోలీసులు అతనివైపు రాబోతున్నారు. వెంటనే ఆయన ఆ పక్కనే ఉన్న బండిపై నిమ్మకాయలమ్ముతున్న అబ్బాయితో "వంద ఏ మాత్రం...వంద ఏ మాత్రం" అని మాట మార్చాడుట. పోలీసులు అలా వెళ్ళగానే మళ్ళీ వందేమాతరం అంటే ఆ బండివాడు కూడా వందేమాతరం అని బదులు పలికాడుట.

*

విజ్ఞాన వీచిక

సైన్స్... సెన్స్

ఎస్. వెంకట్రావు

ఆధునిక మానవుని జీవితం సైన్సుతో గట్టిగా పెనవేసుకుంది. నిజానికి మనం ఈ రోజు ఒక శాస్త్ర-సాంకేతిక మహాసముద్రంలో నివసిస్తున్నాం అంటే అతిశయోక్తి కాదు. మన చుట్టూ ఎన్నెన్ని ఆధునిక పరికరాలని....! సెల్ ఫోన్లు, కంప్యూటర్లు, మోటారు వాహనాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు..... అన్నీ సైన్సు మనకందించిన ఫలాలే. మనిషి అభివృద్ధి చేసిన సైన్సు ఈ రోజు మానవజాతి అభివృద్ధికి చోదక శక్తిగా మారి అతని జీవితాన్ని శరవేగంగా మార్చేస్తోంది.

నిన్నటివరకు ఎడ్లబండ్లే ప్రయాణసాధనాలుగా ఉన్న మనిషి నేడు రోజురోజుకూ మరింత వేగాన్ని పుంజుకుంటున్న ఆటోమొబైల్స్‌లో రయ్ఁ...మని దూసుకుపోతున్నాడు. ధ్వనివేగాన్ని దాటి ఆకాశంలో దూసుకుపోతున్న విమానాలు ఖండాల మధ్య దూరాన్ని తగ్గించేస్తున్నాయి. మనిషి మేధస్సుతో పోటీ పడుతున్న కంప్యూటర్లు, రోజుకో కొత్త ఫీచర్‌తో మార్కెట్లోకి వస్తున్న మొబైల్ ఫోన్లు, ఇంటర్‌నెట్ - ఇవన్నీ కలగలిసిపోతూ రూపొందుతున్న కొత్త పరికరాలు (కన్వర్జెన్స్ టెక్నాలజీ)...మనిషి జీవితంలో తెస్తున్న మార్పులెన్నెన్నో...! ఇవన్నీ సైన్సు తెచ్చినమార్పులు. సాంకేతిక విజ్ఞానం సృష్టించిన మార్పులు.

కాని, సైన్సులో పుట్టి, సైన్సులో పెరుగుతున్న ఆధునిక మానవునిలో సైన్సుకు సంబంధించి ఒక్క లోపం మాత్రం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. మహాసముద్రం మధ్య మంచినీటికి మొహం వాచినట్లు సైన్సు అనే సముద్రంలో పయనిస్తున్న మనిషికి సైన్సు-సెన్స్ మాత్రం అంతగా అబ్బడం లేదు. నిత్యం సెల్ ఫోన్లు ఉపయోగిస్తున్న మనం ఆ సెల్ ఫోన్లు ఎలా, ఏ సూత్రాల ప్రకారం పనిచేస్తున్నాయో తెలుసుకోడానికి సమయం కేటాయించలేకపోతున్నాం. పెట్రోలు, డీజిల్ లేనిదే క్షణం గడవని స్థితిలో ఉన్నాం, కాని ఆ పెట్రోలు ఎక్కడినుండి, ఎలా వచ్చిందో తెలుసుకోడానికి సిద్ధపడకపోతున్నాం. మనం నివసిస్తున్న నేలను జీవనయోగ్యం చేసుకోడానికి పరిసరాలను నిత్యం ధ్వంసం చేస్తున్నాం, కాని ఈ విధ్వంసం మన జీవితాలపై చూపించే ప్రభావాన్ని గురించిమాత్రం పట్టించుకోలేకపోతున్నాం. ప్రతినిత్యం టెక్నాలజీని పెంచుకుంటూ పోతున్నాం. కాని ఆ టెక్నాలజీ మన మనుగడలో తెస్తున్న మార్పుల ఫలితాలను తెలుసుకోలేకపోతున్నాం.

సైన్సును ఉపయోగించుకుంటూ సైన్సు గురించి తెలుసుకోలేకపోవడం అనేక అనర్థాలకు దారితీస్తుంది. భయాలు పెరుగుతాయి, మూఢనమ్మకాలు పెరుగుతాయి, టెక్నాలజీ దుర్వినియోగమవుతుంది. అందువల్ల శాస్త్రవిజ్ఞానం పెరుగుదలతోబాటే మనిషిలో శాస్త్రవిజ్ఞానంపట్ల జిజ్ఞాస పెరగాలి. సైన్సుతోబాటే సైన్సు-సెన్సు పెరగాలి. ఈ రెండూ కలిసి పెరిగినప్పుడే మనిషి ఆలోచనలో సమగ్రత ఏర్పడుతుంది. హేతుబద్ధమైన ఆలోచనా జ్ఞానం అలవడుతుంది. హేతువులేని సైన్సు అంటే శాస్త్రీయత లేని శాస్త్రం. అటువంటి శాస్త్రం మనిషికి సౌభాగ్యాన్ని ఇవ్వొచ్చు కాని సుఖం మాత్రం ఇవ్వదు. అందువల్ల శాస్త్రానికి, శాస్త్రీయ ఆలోచన తోడుకావాలి. అప్పుడే సైన్సు మానవజీవితాన్ని సౌభాగ్యవంతమే కాదు సుఖవంతం కూడా చేస్తుంది. మనం నిత్యం ఉపయోగించే వస్తువులు, మన చుట్టూ నిత్యం జరిగే ఘటనలు, మనం నిత్యం దర్శించే ప్రకృతి విషయాలు....వీటి ఆంతర్యాన్ని తెలుసుకోడానికి ప్రయత్నించినప్పుడు మాత్రమే శాస్త్రీయదృక్పథం అలవడుతుంది. సైన్సును నిత్యం ఉపయోగించుకుంటున్న మనం సైన్సుగురించి నిత్యం తెలుసుకుంటుండాలి. సైన్సు-సెన్సు మన జీవితంలో అంతర్భాగం కావాలి.

కొత్త పుస్తకాలు

రక్తాక్షరాలు

జూలియస్ ఫ్యూజిక్
వెల: రూ.30/-
పేజీలు: 84
ప్రతులకు:- ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలలో 1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్ 20.

ద్వితీయ ప్రపంచ యుద్ధ సమయంలో జెకొస్లొవేకియాకు చెందిన కమ్యూనిస్టు పాత్రికేయుడు జూలియస్ ఫ్యూజిక్ నాజీ కాన్సెంట్రేషన్ క్యాంప్‌లో ఎదుర్కొన్న భయంకర అనుభవాలకు అక్షర రూపం ఇది. దారుణమైన చిత్రహింసలను భరిస్తూ, మరణానికి అంచున ఉంటూ సైతం ఆయన తోటి ఖైదీలలో ఆత్మ విశ్వాసాన్ని నింపడానికి ఎలా ప్రయత్నించారో తెలుపుతుంది ఈ రచన. ఒక జెక్‌గార్డ్ అందించిన పేపర్లు, పెన్సిల్ సాయంతో అతి రహస్యంగా జైల్లో రాసిన ఈ రచనలు అంతే రహస్యంగా పలువురు మిత్రుల ద్వారా బయటికి చేరాయి. చివరకు ఫ్యూజిక్‌ను నాజీలు 1943 సెప్టెంబరు 8న బెర్లిన్‌లో ఉరితీశారు. యుద్ధానంతరం ఫ్యూజిక్ భార్య ఆ జైలు పేపర్లన్నింటినీ సేకరించి ప్రచురించారు. ఏభై ఏళ్ళ క్రితమే తెలుగులోకి అనువదించబడిన ఈ గ్రంథం విశేషాదరణ పొందింది. ఆ తర్వాత పలు ముద్రణలు వెలువడ్డాయి.

"మినిస్టర్-బ్రహ్మరాత"

(నాటకాలు)



రచయిత: డి.విజయభాస్కర్
వెల: రూ.40/- , పేజీలు: 91
ప్రతులకు:- శ్రీమతి డి.గౌరీదేవి, 238/2 ఆర్.టి. సెకెండ్‌ఫ్లోర్ విజయనగర్‌కాలనీ, హైదరాబాద్- 57

నేటిదాకా పదమూడు నాటకాల్ని, 'మౌనం తో మాటలు' అనే కవితా సంకలనాన్ని వెలువరించిన డి.విజయభాస్కర్‌ను చేయితిరిగిన రచయితగా మనం గుర్తించవచ్చు. ఈయన మినిస్టర్, బ్రహ్మరాత అనే రెండు నాటకాలను ఒకే సంపుటిగా అచ్చువేశారు. వీరి రచనల్లో "ముక్కాలు", "మువ్వీసం" నాటకాలు నంది అవార్డులు గెలుచుకున్నట్లుగా వెనుక అట్టమీద విషయాన్ని బట్టి అర్థం చేసుకుంటాం! ఈనాడొచ్చే నాటకాల్లో పరిషత్తు నాటకాలు, సామాజిక ప్రయోజనార్థం రాసే నాటకాలు వేర్వేరు. వీటిలో రెండో కోవకు చెందినవి కాళ్లకూరి నారాయణరావుగారి 'చింతమణి', గురజాడ అప్పారావుగారి 'కన్యాశుల్కం' నాటకాలు.

"మినిస్టర్" నాటకంలో 14 పాత్రలుంటే, బ్రహ్మరాత నాటకంలో 17 పాత్రలున్నాయి. సమాజాన్ని ముఖ్యంగా ఆంధ్రదేశాన్ని పట్టి పీడిస్తున్న లంచగొండితనం, పేదరికం, అధికారదాహం, అసమానతలు అన్నీ ఈ నాటకాల్లో దృశ్యమానమౌతాయి. మొదటి నాటకం 'మినిస్టర్'లో ఓ చక్కని వ్యంగ్యముంది. రాజగోపాలు అనే మినిస్టర్ తాలూకు ఇంతికథని తీసుకుని ప్రారంభంలో అతన్నొక అవినీతిపరుడుగా చిత్రీకరించాడు రచయిత. భార్యాబిడ్డలే తనని చంపడానికి ప్రయత్నించడంతో విరక్తుడైన ఆ మినిస్టర్ సన్మార్గగామిగా మారతాడు. ప్రారంభంలో మనకు ఆ ఇంట్లోనూ, పరిసరప్రాంతాల్లోనూ ఉన్నవారిలో రాజకీయ అవలక్షణాలే కనిపిస్తాయి. తర్వాత అతని భార్యా కొడుకుల మాటల వల్ల కథలో కొట్టొచ్చే మార్పొస్తుంది. రెండవ నాటకం 'బ్రహ్మరాత' దీనిలో సంభాషణల్ని నాటక రచయిత విజయభాస్కర్ ఔచిత్యం చెడకుండా రాశారు. పాత్రలైతే కొన్ని పౌరాణికాలు, మరికొన్ని సాంఘీకాలు. ఇంకా చెప్పాలంటే కాలానుగుణ్యమైనవి. కథ-కథనాల్లో కొత్తదనం లేకపోయినా 'బ్రహ్మరాతంటే – ఆ ధర్మాన్ని మౌనంగా భరించే మత్తు మందు కాదు' అని చాటి చెప్పే నాటకం ఇది.

పాత నాటకాల్లోలా వీటిలో వ్యంగ్యం లేదు. సన్నివేశాలే తప్ప. నేటి డ్రామాటెక్నిక్కన్నీ ఈ రెండింటిలోనూ ప్రయోగిస్తే, నాటకమెక్కడ ప్రదర్శించినా రక్తిగట్టకమానదు.

-డా॥మంతెన.

'తేజోలింగ రహస్యం'



రచన: కె.ఆర్.కె. మోహన్,
పేజీలు: 151, వెల: రూ.80/-
ప్రతులకు: రచయిత, ఫ్లాట్ నెం.101, కంచి రెసిడెన్సీ, 11-19, పిఅండ్‌టి కాలనీ, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్- 500060

సైన్స్‌ఫిక్షన్ రచనలు చేయటంలో కె.ఆర్.కె.మోహన్‌కో ప్రత్యేక గుర్తింపుంది. గతంలో వివిధ పత్రికల్లో తాను నిర్వహించిన శీర్షికలన్నింటినీ 'సైన్స్‌ఫిక్షన్ కథలు' పేరుతో ఒకే సంపుటిగా వెలువరించిన కె.ఆర్.కె. తనదైన ప్రత్యేకముద్రను వేసుకోగలిగారు. ఇప్పుడు 'తేజోలింగ రహస్యం' అనే మరో సైన్స్‌ఫిక్షన్ నవల వెలువరుస్తున్నారు. 'అంతరిక్షంలో అంతర్థానం' అనే మరో నవలనీ దీనిలోనే ప్రచురించడం విశేషం. ఈ రెంటినీ చదివితే ఈ మధ్యనే విడుదలైన ఇద్దరు తెలుగు సినీహీరోలు నటించిన చిత్రాలలోని కథ ప్రధానాంశంగా గుర్తొస్తుంది. ఒకదానిలో 'ఆత్మలింగం' కథ ప్రధానాంశం కాగా మరోదానిలో 'టైం మిషన్' ప్రత్యేకాకర్షణగా అందర్నీ అలరించాయి. ఈ రెండు నవలలు గతంలో (ఒకటి పత్రికలో మరోకటి చిన్న పుస్తకరూపంలో) విడుదలైనా ఎక్కువమంది చెంతకు చేరలేదని పిస్తోంది. ఈ రెండు కథాంశాలు చిత్రరూపంలో వచ్చి ప్రేక్షకులనాకర్షించి, ఆలోచనలు రేకెత్తించటంతో ఇప్పుడే వెలువడిన ఈ నవలలకు ప్రాధాన్యత నంతరించుకోవటం ఖాయమని భావించవచ్చు. ఇవి పిల్లలే కాక పెద్దలుసైతం చదివి ఆనందించ దగ్గవి. ఆలోచనలు రేకిత్తించగలవి. ఈ రెండు కథాంశాలలోని రెండు శాస్త్రీయమైన ఉదాహరణలు మనల్ని అవునని పిస్తాయి. ఇవి అభూతకల్పనలు కాదు. వాస్తవాలని అబ్బురపరుస్తాయి. ఈ రెండు నవలల్లోని కథాంశం రెండు ముక్కల్లో పైన (తేజోలింగం, టైంమిషన్) తెలిపాను. కనుక ఈ పాటికే ఇందులోని అంశం ఏ విధంగా ఉంటుందో అందరికీ అర్థమయ్యే వుంటుంది. కొంత కల్పన, కొంత వాస్తవం, మరికొంత ఆసక్తిల కలయికగా గల ఈ నవల అందరూ చదివి, విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి తోడ్ప డుతుందనడంలో అసత్యం లేదు.

-చలపాక ప్రకాష్

శనగపిండి స్వీట్

కావలసిన వస్తువులు:

శనగపిండి	:	ఒక కప్పు
నెయ్యి	:	అర కప్పు
పాలు	:	పావు కప్పు
పంచదార	:	ఒక కప్పు
ఏలకుల పొడి	:	పావు టీ స్పూన్
బాదం	:	పది
పిస్తా	:	పది
జీడిపప్పు	:	పది

తయారుచేసే విధానం

శనగపిండిలో వేడిపాలు, రెండు టీ స్పూన్ల నెయ్యి వేడిచేసి వెయ్యాలి. పిండిని ముద్దలా కలిపి పెట్టుకోవాలి. రెండు గంటలు మూతపెట్టి ఉంచాలి. పంచదారలో అరకప్పు నీళ్ళుపోసి ఉడికించాలి. లేతపాకం రానివ్వాలి. అందులో ఏలకుల పొడి వేసి కలిపి పక్కన పెట్టాలి. వేరే బాండీలో నెయ్యి వేడిచేసి నానబెట్టి ఉంచిన శనగపిండిని వేసి సువాసన వచ్చే వరకూ బాగా వేయించాలి. పాకం ఆరిపోతే కొద్దిగా వేడి చేసి ఆ పాకాన్ని ఇందులో పోస్తూ బాగా కలిపి ఉడికించాలి. నెయ్యి పైకి తేలిన తరువాత తీసి నెయ్యి రాసిన పళ్ళెంలో పోసి సమంగా చేయాలి. దీనిపై పిస్తా, బాదం, జీడిపప్పు ముక్కలను అలంకరించాలి. ఆరిన తరువాత మనకు నచ్చిన ఆకారంలో ముక్కలుగా చేయాలి.

కార్న్ ఉప్మా

కావలసిన వస్తువులు:

మొక్కజొన్న గింజలు	:	రెండు కప్పులు లేతవి
పచ్చిమిర్చి	:	నాలుగు
ఉప్పు	:	తగినంత
నూనె	:	పావు కప్పు
ఆవాలు	:	అర టీ స్పూన్
వేరుశనగ పప్పు	:	ఓ గుప్పెడు
జీలకర్ర	:	అర టీ స్పూన్
ఎండుమిర్చి	:	రెండు
కరివేపాకు	:	రెండు రెబ్బలు

తయారుచేసే విధానం

ప్రస్తుతం మార్కెట్‌లో మొక్కజొన్న కండెలు పుష్కలంగా లభిస్తున్నాయి. వాటిలో లేతవి ఎంపిక చేసుకొని రెండు కప్పుల గింజలను వలవాలి. వాటిని మిక్సీలో వేసి పేస్టు చేసుకోవాలి. తరువాత బాండీలో నూనె వేడిచేసి ఎండుమిర్చి, వేరుశనగ పప్పు, తాలింపు గింజలు వేసి అవి వేగిన తరువాత పచ్చిమిరప ముక్కలు, కరివేపాకు వేయాలి. అందులో మొక్కజొన్న గింజల పేస్టు కూడా వేసి వేయించి తగినంత ఉప్పు చల్లి దించాలి. వేడివేడిగా వడ్డించాలి. ఇష్టపడే వారు ఉప్మా మీద నెయ్యి వేసుకొని తినొచ్చు. ఇది చాలా సులువుగా చేసుకోవచ్చు. ఆరోగ్యకరమైంది కూడా.

యాపిల్ చెట్టు

చూటీ

చాలా పాత సంగతి. అప్పడు ఒక రైతు వున్నాడు. అతనికి చిన్న పండ్లతోట వుంది. అందులో బోలెడన్ని రకాల పండ్ల చెట్లు వున్నాయి. వాటిలోనే ఓ యాపిల్‌చెట్టుకూడా వుంది. అది పాపం చాలా ముసలిచెట్టు. దానికి యాపిల్ పళ్లు కాయడం మానేసి కూడా చాన్నాళ్లైంది. ఇంక అప్పటినుంచి ఎన్నో పిచ్చుకలు, మిడతలు, ఉడుతలు ఆ చెట్టుమీద చక్కటి ఇళ్లు కట్టుకుని సంతోషంగా నివసించసాగాయి. వానొచ్చినా, మాంచి ఎండ కాసినా, ఈదురుగాలులు కొట్టినా... ఎటువంటి చీకూచింత లేకుండా హాయిగా వుండసాగాయి.

సరిగ్గా అలాంటి సమయంలో రైతు యాపిల్ చెట్టును కొట్టేయాలనుకున్నాడు. దాని నుంచి వచ్చే కలపతో ఇంట్లోకి సామాను చేయించుకోవాలనుకున్నాడు. ఒక గొడ్డలి తీసుకుని చెట్టు దగ్గరకు వచ్చాడు. పిచ్చుకలు, ఉడుతలు, మిడతలు, క్రిమికీటకాలు ఇది చూసి హడలిపోయాయి. 'రైతు గొడ్డలితో వచ్చాడేంటి? చెట్టు నరికేస్తాడా? అప్పడు ఎక్కడికెళ్లాలి?' అని లోలోపల ఎంతగానో బాధపడ్డాయి. అవి అనుకున్నంత జరిగింది. రైతు గొడ్డలితో చెట్టు వేళ్లమీద నరకసాగాడు. దాంతో ఒక్కసారిగా అవన్నీ రైతు చుట్టూ చేరి దీనాతిదీనంగా, విచారంగా... 'ఏవండీ రైతుగారూ! మేము ఎప్పటినుంచో ఈ చెట్టునే నమ్ముకుని బతుకుతున్నామండీ. మాకు వున్న ఒకే ఒక్క నీడ ఈ చెట్టండీ. మీరు దీన్ని నరకొద్దండీ' అని బతిమలాడాయి. కానీ... రైతు చెట్టు నరకకుండా అడ్డుకోవడానికి అవి చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. అతను ఏకాగ్రతతో చెట్టు నరకసాగాడు.

అప్పడు అవన్నీ మళ్లీ ఏడుపుగొంతుతో 'రైతుగారూ! దయచేసి చెట్టు నరకడం ఆపండీ. మీరు పని చేసుకునేటప్పడు మేమంతా పాటలు పాడి మీకు కష్టం తెలియకుండా చేస్తామండీ' అన్నాయి. అయినా రైతు అవేమీ వినిపించుకోలేదు. చెట్టును నరకసాగాడు. ఈలోగా చెట్టు మీదనుంచి ఏదో వచ్చి రైతు మొహాన కుట్టింది. ఏంటోనని పైకి చూశాడతను. అప్పడు అక్కడ ఒక పెద్ద తేనెతుట్టె కనిపించింది. దాని నిండా తేనెవుంది. చూడగానే రైతుకి నోరూరింది. వెంటనే కొద్దిగా తేనె తీసుకుని రుచి చూశాడు. 'ఆ.. ఉమ్... అమృతంలాగా వుంది. ఇకనుంచి ఈ తేనెనంతా ఇంటికి తీసుకెళ్లాలి. నేను తేనెను తీసుకెళుతూ వుంటే తేనెటీగలు మళ్లీ నింపుతూ వుంటాయి' అనుకున్నాడు సంతోషంగా.

వెంటనే చెట్టుపైకి చూసి పెద్దగా 'హేయ్! ఉడుతలూ, మిడతలూ, పిచ్చుకలూ... నేను చెట్టును నరకడం ఆపేస్తున్నాను. ఇకముందు కూడా మీరంతా సంతోషంగా ఇక్కడే వుండొచ్చు' అన్నాడు.

ఆ మాటలకు అవన్నీ ఎంతో సంతోషించాయి. ఎగిరి గంతులేశాయి. చెట్టుకొమ్మలు పట్టుకుని ఉయ్యాలలూగాయి. పాటలు పాడాయి. తాము ఎక్కడికీ పోనవసరంలేదని ఇరుగుపొరుగు స్నేహితులకు చెప్పేశాయి.

కాసేపటికి వాటన్నిటికీ ఒక అనుమానం వచ్చింది. అదేంటంటే...తాము ఎంతగా బతిమాలినా మొండిగా చెట్టుని నరుకుతానన్న రైతు ఎందుకని ఆ పని చెయ్యలేదు? అనే. ఎంతగా ఆలోచించినా వాటికి సమాధానం తెలియలేదు. దాంతో అన్నీ కలిసి ఆ చెట్టుమీద నివసించే జీవులన్నిటిలోకి ముసలిదైన ఉడుత దగ్గరకు వెళ్లి అడిగాయి. అప్పడది చిన్నగా నవ్వి 'వెర్రి నాగన్నలూ..! ఈ యాపిల్ చెట్టువల్ల అస్సలు ఉపయోగం లేదనుకుని రైతు దీన్ని నరికేయాలనుకున్నాడు. కానీ... అతను తేనెతుట్టెను చూశాక, దాని రుచి తెలిశాక మనసు మార్చుకున్నాడు. ఈ చెట్టువల్ల ప్రయోజనం వుందని తెలుసుకున్నాడు. అందుకే చెట్టు నరకకుండా వదిలేశాడు' అంది.

దాంతో అవన్నీ దీర్ఘంగా నిట్టూర్చి 'ఓ.... అదా సంగతి. అంటే... మనుషులకు చెట్లవల్ల ఏదో ఒక ప్రయోజనం వుందని తెలియకే వాటిని నరుకుతున్నారన్నమాట' అనుకుంటూ తమ తమ ఇళ్లకు వెళ్లిపోయాయి.